ప్రతిపక్షం

www.prathipaksham.in

బుధవారం 17.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 267 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



ఆసియా కప్ అండర్ 19.. టీమిండియా భారీ విజయం 8



విద్యారంగ అభివృద్ధికి మద్దతుగా నిలవండి

- సమగ్రాభివృద్ధికి 30 వేల కోట్లు వెచ్చించనున్నాం
- ప్రత్యేక ప్రయోజన సంస్థ ఏర్పాటు చేయాదల్చాం
- ఎఫ్ఆర్‌బీఎం నుంచి మినహాయింపు ఇవ్వండి
- ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి సహకరించండి
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం రేవంత్‌వినతి

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, డిసెంబర్16: తెలంగాణ విద్యారంగ అభివృద్ధికి మద్దతుగా నిలవాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో అత్యధిక సంఖ్యలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సీఎం రేవంత్‌కేంద్ర మంత్రికి వివరించారు. మంగళవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో పార్లమెంట్ లోని ఆమె ఛాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా 105 శాసనసభ నియోజకవర్గాల్లో

...:: మిగతా 2లో

అత్యాధునిక వసతులు, లేబొరేటరీలు, స్టేడియాలతో నిర్మించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రూ.21 వేల కోట్ల వ్యయమవుతుందని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. అలాగే, రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ, సాంకేతిక కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో ఆధునిక ల్యాబ్‌లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు మరో రూ.9 వేల కోట్లు వెచ్చించనున్నట్లు వివరించారు. రాష్ట్రంలో విద్యా రంగం సమగ్రాభివృద్ధికి తమ ప్రభుత్వం రూ.30 వేల కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. ఈ నిధుల సమీకరణకు ప్రత్యేక ప్రయోజన సంస్థ (ఎస్పీసీ) ఏర్పాటు చేయాదల్చామని, దాని ద్వారా సేకరించే రుణాలకు ఎఫ్ఆర్‌బీఎం పరిమితి నుంచి మినహాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు.

మహాత్ముడి పేరు తొలగిస్తారా ?

ఉపాధి బిల్లుపై అట్టుడికిన పార్లమెంట్

జాతిపితకు అవమానం.. ప్రతిపక్ష పార్టీల ఆగ్రహం



- బిల్లును పార్లమెంటరీ కమిటీకి పంపాలని డిమాండ్
- పార్లమెంటు వెలుపల విపక్షాల నిరసన
- నరేగా.. విప్లవాత్మక చట్టం: ప్రియాంకా గాంధీ
- విపక్ష నిరసనల మధ్య 'వీబీ- జీ రామ్ జీ' బిల్లు
- పవేశపెట్టిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

ఉపాధి బిల్లుపై పార్లమెంట్‌అట్టుడికింది. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మహాత్మాగాంధీ పేరును తొలగించి వీబీ- జీ రామ్ జీ బిల్లును ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టడంపై విపక్ష సభ్యులు మంగళవారం పార్లమెంటులో తీవ్ర నిరసన తెలిపారు. బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీని అవమానిస్తున్నదని ఆరోపిస్తూ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కాంప్లెక్స్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ప్రియాంక గాంధీతోపాటు సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, డీఎంకే ఎంపీ టీఆర్ బాలు, ఆర్‌ఎస్‌పీ ఎంపీ ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ తదితరులు నిరసన తెలిపారు.

...:: 2లో



కారు నడుపుతున్న ప్రిన్స్ పక్కన మోడీ

జోర్డాన్ పర్యటనలో భాగంగా మంగళవారం ప్రధాని మోదీ జోర్డాన్ మ్యూజియాన్ని సందర్శించారు. ఆ దేశ యువరాజు అల్ హుస్సేన్ బిన్ అబ్దుల్లా-2 స్వయంగా కారు నడుపుతూ మోదీని మ్యూజియానికి తీసుకెళ్లడం విశేషం.

7



'స్టాట్యూ ఆఫ్ లిబర్టీ' కూలింది

బ్రెజిల్‌ని బలమైన తుఫాను అతలాకుతలం చేసింది. బలమైన గాలులకు తీవ్రతకు మెట్రోపాలిటన్ ప్రాంతంలోని పోర్టో అలెగ్రే సమీపంలో గల గువైబా నగరంలో ఉన్న స్టాట్యూ అఫ్ లిబర్టీ విగ్రహం ఒక్కసారిగా నేలకూలిపోయింది.

7



మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన మావోయిస్టులు

మావోలకు కోలుకోలేని దెబ్బ

- ఆర్థిక వనరులపై కేంద్రం ఆటాక్
- రూ.92 కోట్ల ఆస్తులు సీజ్
- ఎన్ఐఎ ద్వారా రూ.40 కోట్లు సీజ్
- ఢిల్లీ పోలీసులచే రూ.40 కోట్లు జప్తు
- ఈడీ చేత రూ.12 కోట్లు స్వాధీనం
- అంతిమ దశలో మావోయిస్టు ఉద్యమం?

ప్రతిపక్షం బ్యూరో, ఉత్తర తెలంగాణ

డిసెంబర్ 16: మావోయిస్టుల నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం దూకుడు పెంచింది. దేశంలో మావోయిస్టుల ఉనికిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్రం ముందుకు సాగుతోంది. సాయుధ చర్యలతో పాటు ఆర్థిక మూలాలను లక్ష్యంగా చేసుకున్న వ్యూహంలో భాగంగా దేశవ్యాప్తంగా మావోయిస్టులకు చెందిన రూ.92 కోట్ల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు కేంద్రం అధికారికంగా ప్రకటించింది. ఈ పరిణామం మావోయిస్టు ఉద్యమానికి తీవ్రమైన దెబ్బగా విశ్లేషకులు చెబుతున్నారు. మావోయిస్టుల ఏరివేతకు సంబంధించి కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో పలు దర్యాప్తు సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. జాతీయ దర్యాప్తు సంస్థ రూ.40 కోట్లు, ఢిల్లీ పోలీసులు రూ.40 కోట్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రూ.12 కోట్లు మొత్తంగా ఇప్పటివరకు రూ.92 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేయడం ద్వారా మావోయిస్టుల ఆర్థిక నెట్‌వర్క్‌ను కట్టడి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఆపరేషన్ కగార్ కొనసాగుతోంది

దండకారణ్యంలో భారీ భద్రతా బలగాల కూంబింగ్ కొనసాగుతోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో

...:: మిగతా 2లో



పోలీసుల అదుపులో మావోయిస్టు అధినేత?

- సిర్పూర్ (యూ) పోలీసుల అదుపులో 16 మంది మావోయిస్టులు

...:: 2లో

ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన 34 మంది

...:: 7లో

'విజయ్ దివస్' గర్వించదగిన రోజు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- పరేడ్ గ్రౌండ్‌అమర జవాన్ల స్థూపం వద్ద నివాళులు
- 1971లో భారత్‌కు చరిత్రాత్మక విజయం
- సైనికుల వీరత్వం తరాల పాటు స్ఫూర్తినిస్తుంది
- గోల్కొండ కోటలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి జూపల్లి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్16: ఆనాటి భారత సైనికులు ధైర్య సాహసాలతో బంగ్లాదేశ్ కు విముక్తి కల్పించిన రోజు విజయ్ దివస్.. ఈరోజు చరిత్రలో గర్వించదగిన, గుర్తుంచుకోదగిన రోజు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. విజయ్ దివస్ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్లోని అమర జవాన్ల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడారు. విజయ్ దివస్ సందర్భంగా

...:: మిగతా 2లో





జేపీసీకి ఉన్నత విద్యా కమిషన్ బిల్లు

ఉన్నత విద్యా సంస్థలను నియంత్రించడానికి 13 మంది సభ్యుల వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ఉద్దేశించిన బిల్లును సంయుక్త పార్లమెంటరీ సంఘానికి (జేపీసీ) నివేదిస్తూ లోక్‌సభ మంగళవారం ఓ తీర్మానాన్ని ఆమోదించింది.

7

యూరియా సరఫరాలో ఇబ్బందులు రావద్దు

- ప్రత్యామ్నాయ ప్రణాళికతో సిద్ధంగా ఉండండి
- యూరియా ఉత్పత్తిపై మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు సమీక్ష
- ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులతో సమావేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్16: యూరియా సరఫరాలో ఇబ్బందులు రావొద్దని, ఆటంకాలు లేకుండా యూరియా ఉత్పత్తికి ప్రత్యామ్నాయ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులను ఆదేశించారు. పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు రామగుండం ఎరువుల కర్మాగారం అధికారులతో యూరియా ఉత్పత్తిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఖరీఫ్ సీజన్‌లో రామగుండంలో ఎరువుల ఉత్పత్తి నిలిచిపోవడం వల్ల తెలంగాణ రైతులకు యూరియా సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదురైన విషయాన్ని వ్యవసాయశాఖ మంత్రి గుర్తు చేశారు. కేంద్ర ఎరువుల రసాయనాల శాఖ నుంచి 2,05,315 మెట్రిక్ టన్నుల కేటాయింపులకు గాను కేవలం 1,10,720 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా కావడం వల్ల లోటు



ఏర్పడిందని తెలిపారు. ఈ లోటును భర్తీ చేయాలని కేంద్రాన్ని పలుమార్లు కోరినప్పటికీ సమయానికి స్పందన లేకపోవడం వల్ల రైతులు నష్టపోయారని అన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు రబీ సీజన్‌కు సంబంధించి ఆర్‌ఎఫ్‌సీఎల్‌తీసుకుంటున్న చర్యలు, ఉత్పత్తిలో ఎలాంటి ఆటంకాలు రాకుండా చేపడుతున్న ఏర్పాట్లపై ఆరా తీశారు. గత ఖరీఫ్‌లో హెచ్టీఆర్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యల కారణంగా ఉత్పత్తి నిలిచిపోయిందని, రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులకు చింతిస్తున్నామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ రబీలో ఎలాంటి సమస్యలు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో కేటాయింపుల మేరకు యూరియాను సరఫరా చేశామని, డిసెంబర్ నెలలో కూడా 50,450 మెట్రిక్ టన్నుల సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రామగుండంలో నెలకు సుమారు లక్ష టన్నుల యూరియా ఉత్పత్తి అవుతున్నప్పటికీ తెలంగాణకు కేవలం 40-50 శాతం మాత్రమే కేటాయింపులు జరుగుతున్నాయని అన్నారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే యూరియాలో కనీసం 70 శాతం అయినా తెలంగాణకే కేటాయిస్తే రవాణా ఖర్చులు తగ్గి, రైతులకు వేగంగా ఎరువులు

...:: మిగతా 2లో



స్పోర్ట్స్ మినిస్టర్ రాజీనామా ఆమోదం

అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ పర్యటన సందర్భంగా ఉద్రిక్తతలకు బాధ్యత వహిస్తూ బెంగాల్ స్పోర్ట్స్ మినిస్టర్ అరూప్ బిశ్వాస్ తన పదవికి రాజానామా చేయగా.. సీఎం మమత బెనర్జీ ఆమోదముద్ర వేశారు.

7

ప్రతిపక్షం
Prathipaksham.in
2
హైదరాబాద్
బుధవారం
17.12.2025
@prathipaksham
prathipakshamtvtelugu

రాజకీయం

నేడు జిల్లా కేంద్రాలలో నిరసనలు

- టీపీసీసీ చీఫ్‌మహేశ్‌కుమార్‌గౌడ్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్16 : జాతీయ ఉపాధి హామీ పథకంలో మహాత్మాగాంధీ పేరును తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రను గ్రామీణ ప్రజలకు తెలియజేయాలని ఏఐసీసీ పిలుపునిచ్చింది. ఏఐసీసీ పిలుపు మేరకు రేపు అన్ని జిల్లా కేంద్రాలలో మహాత్మా గాంధీ చిత్ర పటాలతో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఉపాధి హామీ పథకాన్ని నీరు గార్చేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆయన అన్నారు. ఉపాధి హామీ పథకం అమలు బాధ్యతల నుంచి కేంద్రం పక్కకు జరగాలని చూస్తోందన్నారు. పేదలకు, గ్రామీణ ప్రాంత కూలీలకు ఎంతో భరోసాగా ఉన్న ఈ పథకాన్ని నీరు గార్చాలని బీజేపీ చూస్తోందని మండిపడ్డారు. అందుకు నిరసనగా రేపు 17న జిల్లా కేంద్రాలలో డీసీసీ అధ్యక్షుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అలాగే జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 28న గ్రామాలలో, మండలాల్లో గాంధీ చిత్రపటాలతో కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి, పనికి ఇచ్చే గౌరవాన్ని తెలపాలన్నారు. 17న, 28న కార్యక్రమాలను పెద్దఎత్తున విజయవంతం అయ్యేలా ప్రతి కార్యకర్త, నాయకులు పాల్గొనాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

సింగరేణి సీఎండీగా కృష్ణ భాస్కర్



సింగరేణి సంస్థ ప్రస్తుత సీఎండీ ఎన్. బలరామ్ ఏడు సంవత్సరాల డిప్యూటేషన్ అనంతరం మాతృ విభాగానికి తిరిగి వెళుతున్న నేపథ్యంలో సింగరేణికి సీఎండీ (ఎఫ్ఏసీ)గా దేవరకొండ కృష్ణ భాస్కర్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఆయన సింగరేణి భవన్లో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుత చైర్మన్ ఎన్. బలరామ్ నుండి బాధ్యతలను తీసుకున్నారు.

- ప్రతిపక్షం, హైదరాబాద్

పోలీసుల అదుపులో మావోయిస్టు అధినేత?

- సిర్పూర్ (యూ)లో పోలీసుల అదుపులో 16 మంది మావోయిస్టులు



ప్రతిపక్షం, ఆదిలాబాద్, డిసెంబర్ 16: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ (యూ) మండలంలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు పట్టుబడ్డారు. సోమవారం రాత్రి సిర్పూర్ అడవుల్లో పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో పోలీసులు 16 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో ఇటీవల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో మావోయిస్టులు వారి స్థావరాలను మారుస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ నిఘా విభాగం సమాచారం అందించడంతో ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, స్పెషల్ పార్టీ పోలీసులు సిర్పూర్ (యూ) అడవుల్లో కూంబింగ్ నిర్వహించగా.. మావోయిస్టు స్థావరం కనిపెట్టారు. మొత్తం 16 మంది మావోయిస్టులను పట్టుకున్నట్లు ఏఎస్పీ చిత్తరంజన్ తెలిపారు. అదుపులోకి తీసుకున్నవారిలో మావోయిస్టు అధినేత చొక్కరావును ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే అనేక మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందగా.. భారీ సంఖ్యలో మావోలు లొంగిపోయారు. ఇప్పుడు తాజాగా మావోయిస్టు కీలక నేత పోలీసులకు చిక్కినట్లు తెలుస్తోంది. పట్టుబడ్డ వారిలో 9 మంది మహిళలు ఉండగా 7 పురుషులు ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం వారందనీ హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి తరలిస్తున్నారు. మావోయిస్టులు పట్టుబడటం పై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.


తెలంగాణ జాగృతి పోరాటాల ఫలితం

- ప్రభుత్వ భూముల ఆక్రమణలపై విచారణ
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 16: తెలంగాణ జాగృతి చేపట్టిన నిరంతర పోరాటాల ఫలితంగానే ఐడీపీఎల్ సహా ప్రభుత్వ భూముల ఆక్రమణలపై విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఇది ముమ్మాటికీ తెలంగాణ జాగృతి విజయమేనని ఆమె స్పష్టం చేశారు. జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ జిల్లా పర్యటన సందర్భంగా ప్రజలు ఐడీపీఎల్‌తో పాటు ప్రభుత్వ భూముల ఆక్రమణల విషయాన్ని తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ అంశాలను మీడియా ద్వారా ప్రభుత్వానికి తెలియజేశామని, దానికి స్పందించి విజిలెన్స్, రెవెన్యూ అధికారులతో కలిపి విచారణకు ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నట్లు కవిత పేర్కొన్నారు. ఈ విచారణలో నిజాలు నిగ్గుతేలాలని, రాజకీయ కారణాలతో తమ కుటుంబంపై ప్రత్యర్థులు చేసిన తప్పుడు ఆరోపణలు కూడా ఈ ప్రక్రియలో వెలుగులోకి వస్తాయని ఆమె అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వివిధ విచారణల పేరుతో ప్రచారం చేసుకోవడం తప్ప, స్పష్టమైన చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై జరుగుతున్న విచారణను త్వరితగతిన పూర్తి చేసి, అక్రమార్కుల చెర నుంచి ప్రభుత్వ భూములను విముక్తం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములన్నీ ప్రజలకే చెందాలని ఆమె స్పష్టం చేశారు.





ఇది రాజ్యాంగంపై దాడి

- ఉపాధి హామీ పథకం పేరుమార్పుకు వ్యతిరేకంగా ఢిల్లీలో ఎంపీ వంశీకృష్ణ నిరసన

ప్రతిపక్షం బ్యూరో, ఉత్తర తెలంగాణ (కరీంనగర్), డిసెంబర్16: ఉపాధి హామీ పథకం పేరు మార్పును నిరసిస్తూ పార్లమెంట్లోని మహాత్మా గాంధీ విగ్రహం ఎదుట కాంగ్రెస్ ఎంపీలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ నిరసనలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పాల్గొని కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. పథకంలోని మహాత్మా గాంధీ పేరు తొలగించాలనే ప్రయత్నం రాజ్యాంగంపై చేసిన దాడి అని ఎంపీ వంశీకృష్ణ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికి వెన్నెముకగా రూపొందించిన ఈ పథకాన్ని రాజకీయ కారణాలతో బలహీనపరచాలనే ప్రయత్నాన్ని ప్రజలు అంగీకరించరని స్పష్టం చేశారు. కేవలం సంక్షేమ పథకం మాత్రమే కాదని, ఇది పేదలకు పని, గౌరవం, జీవన భద్రతను హామీ ఇచ్చిన రాజ్యాంగ పరమైన హక్కు అని తెలిపారు. కోట్లాది కుటుంబాలకు ఉపాధి కల్పించి, సంక్షోభ కాలాల్లో ఆశగా నిలిచిన ఈ పథకం నుంచి గాంధీజీ పేరు తొలగించడం అంటే భారతదేశ ఆత్మపై దాడి చేయడమేనని వ్యాఖ్యానించారు. గాంధీజీ పేరు న్యాయం, శ్రమ, చివరి వరుసలో ఉన్న పేదవాడి ఆశకు ప్రతీక అని పేర్కొంటూ, స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తరువాత కూడా బీజేపీకి గాంధీజీ పేరు ఎందుకు భయం? అని ప్రశ్నించారు.ఇది సంస్కరణ కాదు, రాజకీయ ప్రతీకారమని; ఇది పాలన కాదు - చరిత్రను చెరిపేయాలనే ప్రయత్నమని ఎంపీ వంశీకృష్ణ మండిపడ్డారు. ఇది రాజ్యాంగంపై దాడే అని స్పష్టం చేస్తూ, గాంధీజీ విలువలను కాపాడేందుకు దేశం మొత్తం ప్రతిఘటిస్తుందని అన్నారు.

విద్యారంగ అభివృద్ధికి మద్దతుగా నిలవండి

మొదటిపేజీ తరువాయి

నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ప్రాధాన్యతను కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. సమీప ప్రభుత్వ పాఠశాలలకు విద్యా హబ్‌లుగా ఉండడంతో పరోక్షంగా లక్షలాది మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని సీఎం తెలియజేశారు.

విద్యా రంగం సమగ్రాభివృద్ధికి 30 వేల కోట్లు

అత్యాధునిక వసతులు, లేబొరేటరీలు, స్టేడియాలతో నిర్మించే ఈ 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రూ.21 వేల కోట్ల వ్యయమవుతుందని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. అలాగే, రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ, సాంకేతిక కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో ఆధునిక ల్యాబ్‌లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు మరో రూ.9 వేల కోట్లు వెచ్చించనున్నట్లు వివరించారు. రాష్ట్రంలో విద్యా రంగం సమగ్రాభివృద్ధికి తమ ప్రభుత్వం రూ.30 వేల కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. ఈ నిధుల సమీకరణకు ప్రత్యేక ప్రయోజన సంస్థ (ఎస్పీవీ) ఏర్పాటు చేయాదల్చామని, దాని ద్వారా సేకరించే రుణాలకు ఎఫ్ఆర్‌బీఎం పరిమితి నుంచి మినహాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. విద్యా రంగంపై తమ ప్రభుత్వం చేస్తున్న వ్యయాన్ని మానవ వనరుల అభివృద్ధికి చేస్తున్న పెట్టుబడిగా భావించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు, రాష్ట్రంలో విద్యా రంగం అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూపుతున్న చొరవను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రశంసించారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, మందాడి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు ఐఐఎం మంజూరు చేయండి

- కేంద్రీయ, నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయండి
- కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు సీఎం వినతి

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్16: హైదరాబాద్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) మంజూరు చేయాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఏరో స్పేస్, డిఫెన్స్, లాజిస్టిక్స్, అడ్వాన్సుడ్‌మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో ముందున్న హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. దేశంలో 19 రాష్ట్రాల్లో, 1 కేంద్ర పాలిత ప్రాంతంలో కలిపి 21 ఐఐఎం లు ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రంలోనూ ఐఐఎం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన 200 ఎకరాల భూమిని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రాంగణంలో గుర్తించామని సీఎం కేంద్ర మంత్రికి తెలిపారు. ఐఐఎం తరగతులు వెంటనే ప్రారంభించేందుకు ట్రాన్సిట్ క్యాంపస్ సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి సీఎం వెల్లడించారు. దేశంలోని అన్ని ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా హైదరాబాద్ కు ఎయిర్, రైల్, రోడ్ కనెక్టివిటీ ఉందని, అనుకూల వాతావరణం, భిన్న రంగాల ప్రముఖులను అందజేసిన చరిత్ర హైదరాబాద్‌కు ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు.

జిల్లాల సంఖ్యకు అనుగుణంగా..

తెలంగాణలో పెరిగిన జిల్లాల సంఖ్యకు అనుగుణంగా నూతనంగా 9 కేంద్రీయ విద్యాలయాలు, 16 జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కొమురం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, జోగులాంబ గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, వికారాబాద్, నిర్మల్ జిల్లాల్లో కేంద్రీయ విద్యాలయాలు, హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, మహబూబాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్, ములుగు, నారాయణపేట, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, వనపర్తి, యాదాద్రి భువనగిరి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయాలు వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. అవసరమైన వసతులు కల్పించడానికి తాము సిద్ధంగా ఉన్నామని సీఎం తెలిపారు.

మహాత్ముడి పేరు తొలగిస్తారా?

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, డిసెంబర్16: విపక్ష సభ్యుల నిరసనల మధ్య ఎంజీనరేగా స్థానంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్(గ్రామీణ్) (వీబీజీ రామ్ జీ) బిల్లును కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెడుతూ మహాత్మా గాంధీని విశ్వసించడంతోపాటు ఆయన సిద్ధాంతాలను ప్రభుత్వం ఆచరిస్తున్నదని తెలిపారు. ప్రవేశ దశలోనే బిల్లును తీవ్రంగా వ్యతిరేకించిన విపక్ష సభ్యులు బిల్లును పార్లమెంటరీ కమిటీకి పంపాలని డిమాండు చేశారు. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ సహా పలువురు విపక్ష ఎంపీలు బిల్లులో మహాత్మా గాంధీ పేరును తొలగించడం పై అభ్యంతరం తెలిపారు. డీఎంకే సభ్యుడు టీఆర్ బాలు మాట్లాడుతూ మహాత్మాగాంధీ గ్రామాల్లో నివసించి అక్కడి పేదల సంక్షేమం కోసం పాటుపడ్డారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు 100 రోజుల పని కల్పించి వారిని ఆదుకున్న ఉదాత్తమైన బిల్లును(ఎంజీనరేగా)ను అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ తీసుకువచ్చారని ఆయన గుర్తు చేశారు.

నరేగా.. విప్లవాత్మక చట్టం

ముసాయిదా చట్టం పట్ల తన తీవ్ర అభ్యంతరాన్ని ప్రకటించిన ప్రియాంక గాంధీ నరేగాను విప్లవాత్మక చట్టంగా అభివర్ణించారు. అప్పుడు ఆ చట్టాన్ని ఆమోదించినపుడు సభలోని సభ్యులందరూ ఆమోదం తెలిపారని ఆమె గుర్తు చేశారు. దేశంలోని నిరుపేదలకు 100 రోజుల ఉపాధి లభించిందని, కాని ప్రస్తుత బిల్లు పేదల ఉపాధి హక్కులను బలహీనపరుస్తున్నదని ఆమె ఆరోపించారు. ఇది రాజ్యాంగానికే వ్యతిరేకమని ఆమె తెలిపారు. నరేగా కింద చేపట్టిన పనులకు కేంద్రం 90 శాతం నిధులు అందచేసేలా చట్టం నిర్దేశించిందని, కాని ప్రస్తుత బిల్లు దాన్ని 60 శాతానికి తగ్గిస్తున్నదని ఆమె చెప్పారు. ఇది రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తుందని, ప్రత్యేకంగా జీఎస్‌టీ పరిహారం కోసం ఎదురుచూసే రాష్ట్రాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపగలదని ఆమె అన్నారు. ప్రతిపాదిత కొత్త చట్టం ద్వారా పథకంపై కేంద్ర పెత్తనం పెరిగి బాధ్యత తగ్గిపోతుందని ఆమె చెప్పారు.

'రామరాజ్య' స్థాపన కోసం..

ప్రతిపక్షాల విమర్శలపై కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఘాటుగా స్పందించారు. ఈ బిల్లు 'రామరాజ్య' స్థాపన కోసమని, బిల్లులో 'రామ్' అనే పేరు ఉండటం వల్లే ప్రతిపక్షాలకు సమస్యగా మారిందని ఆయన అన్నారు. ఈ బిల్లు పేదల సంక్షేమం కోసమని, ఇది భారత్ సమగ్ర అభివృద్ధికి తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. "మహాత్మా గాంధీ మా హృదయాల్లో ఉన్నారు. రాముడు మా అణువణువునా ఉన్నాడు. గాంధీ గారు కూడా రామరాజ్యం గురించి మాట్లాడేవారు" అని ఆయన వ్యాఖ్యానించారు.

మహాత్ముని విగ్రహం వద్ద నిరసన

విపక్షాల భారీ నిరసనలు, నినాదాల మధ్య లోక్‌సభ కార్యకలాపాలు మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడ్డాయి. పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష ఎంపీలు మహాత్మా గాంధీ ఫోటోలు ఉన్న పోస్టర్లను పట్టుకుని నిరసన తెలిపారు. 'మహాత్మా గాంధీ అమర్ రహే' అంటూ నినాదాలు చేస్తూ ఉపాధి హామీ పథకం పేరు మార్పును వ్యతిరేకించారు. సభలోనుంచి వెలుపలకు వచ్చిన అనంతరం విపక్ష సభ్యులంతా కలసి పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కాంప్లెక్స్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ప్రియాంక గాంధీతోపాటు సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, డీఎంకే ఎంపీ టీఆర్ బాలు, ఆర్ఎస్‌పీ ఎంపీ ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ తదితరులు నిరసన తెలిపారు. మహాత్మా గాంధీని అవమానిస్తే దేశం సహించదు అంటూ వారు నినాదాలు చేశారు. చేతిలో మహాత్మా గాంధీ చిత్ర పటాలతో పార్లమెంట్ మకర్ ద్వార్ వద్దకు చేరుకున్న విపక్ష ఎంపీలు అక్కడ నుంచి ప్రేరణ స్థల్‌లో జాతిపిత విగ్రహం వద్దకు నడిచారు. దేశ స్వాతంత్ర్యోద్యమంలో అత్యంత కీలకమైన పాత్రను పోషించి జాతి ఆత్మను మేల్కొలిపిన మహాత్మా గాంధీని కేంద్ర ప్రభుత్వం అవమానిస్తున్నదని అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. కొత్తగా చేయడానికి ఏమీ లేకపోవడంతో ఎన్‌డీఏ ప్రభుత్వం పాత పథకాల పేర్లు మారుస్తున్నదని ఆయన ఎద్దేవా చేశారు. పథకాల పేర్లు మార్చడంలో మోదీ ప్రభుత్వం చూపుతున్న వ్యామోహాన్ని ప్రియాంక ఎండగట్టారు. మన జాతిపిత మహాత్మా గాంధీ పేరుతో ఉన్న పథకం పేరును కూడా మారుస్తారా అని ఆమె నిలదీశారు.



యూరియా సరఫరాలో ఇబ్బందులు రావద్దు

మొదటిపేజీ తరువాయి

అందించవచ్చని స్పష్టం చేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని పరిశ్రమల శాఖ ఎండీని మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. అలాగే ఉత్పత్తిలో ఎలాంటి అవాంతరాలు వచ్చినా ప్రత్యామ్నాయ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని ఎన్ఎఫ్ఎల్ కంపెనీ ప్రతినిధులను మంత్రులు ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ కార్యదర్శి, పరిశ్రమల శాఖ ఎండీ, టీఎస్ఐడీసీ ఎండీ, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఇదే సమావేశంలో ఖమ్మం జిల్లా బుగ్గపాడు ఫుడ్ పార్క్‌లో నెలకొల్పనున్న పరిశ్రమల పురోగతిపై కూడా సమీక్ష జరిపి, వచ్చే జనవరిలో శంకుస్థాపనలు జరిగేలా అనుమతులను వేగంగా మంజూరు చేయాలని మంత్రులు అధికారులను ఆదేశించారు.

'విజయ్ దివస్' గర్వించదగిన రోజు

మొదటిపేజీ తరువాయి



ఆనాటి అమర జవాన్లను స్మరించుకోవడం గుర్తించుకోదగిన సందర్భమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. యుద్ధ సమయంలో భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడిన నాటి ప్రధాని ఇందిరా గాంధీ, సైనిక నాయకులు, అమర జవాన్లు అందరికీ వందనాలు అని డిప్యూటీ సీఎం తెలిపారు.

గర్వించదగిన క్షణాలు: మంత్రి జూపల్లి

1971లో ధైర్యం, త్యాగంతో భారత్‌కు చరిత్రాత్మక విజయాన్ని అందించిన వీర సైనికులను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్మరించుకున్నారు. వారి దృఢ సంకల్పం, నిస్వార్థ సేవ దేశాన్ని రక్షించాయని, దేశ చరిత్రలో గర్వించదగిన క్షణాలను లిఖించారని చెప్పారు. ఈ విజయ్ దివస్ వారి పరాక్రమానికి వందనమర్పించేదిగా, వారి అసమాన స్ఫూర్తికి చిహ్నంగా నిలుస్తుందని తెలిపారు. సైనికుల వీరత్వం తరాల పాటు భారతీయులకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని చెప్పారు. విజయ్ దివస్‌ను పురస్కరించుకుని మంగళవారం చారిత్రక గోల్కొండ కోటలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. 1971 యుద్ధంలో భారత సాయుధ దళాలు కేవలం 13 రోజుల్లోనే చారిత్రక విజయం సాధించాయని, 93 వేల మంది పాకిస్థాన్ సైనికులు లొంగిపోవడంతో బంగ్లాదేశ్ అవతరించిందని మంత్రి గుర్తు చేశారు. అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ దృఢమైన నాయకత్వమే ఈ విజయానికి ప్రధాన కారణమని తెలిపారు. అంతర్జాతీయ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ జాతీయ ప్రయోజనాల కోసం ఆమె ధైర్యంగా నిర్ణయాలు తీసుకున్నారని, సాయుధ దళాలపై సంపూర్ణ విశ్వాసం ఉంచి వారికి పూర్తి స్వేచ్ఛనిచ్చారని అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను ప్రస్తావించిన మంత్రి, భారత్ శాంతిని కోరుకుంటూనే జాతీయ భద్రతకు ముప్పు వస్తే గట్టిగా ప్రతిస్పందిస్తుందనే స్పష్టమైన సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చిందన్నారు. గోల్కొండ కోట వంటి చారిత్రక ప్రదేశంలో విజయ్ దివస్‌ను జరుపుకోవడం గర్వకారణమని, తెలంగాణ రాష్ట్రం ఎల్లప్పుడూ సాయుధ దళాల పక్షాన దృఢంగా నిలుస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్పీ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా, బ్రిగేడియర్ రాహుల్, డీజీపీ శివధర్ రెడ్డి, టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం, ఎండీసీఆర్ఎల్ ఎండీ నర్సింహారెడ్డి, టీజీటీడీసీ ఎండీ క్రాంతి వల్లూరు, తదితరులు పాల్గొన్నారు.

మావోలకు కోలుకోలేని దెబ్బ

మొదటిపేజీ తరువాయి

మావోయిస్టుల గుర్తింపు ఎన్‌కౌంటర్లు, అరెస్టులు, లొంగుబాట్లు పెరుగుతున్నాయి. దండకారణ్యం కేంద్రంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్ ద్వారా భద్రతా బలగాలు విస్తృతంగా కూంబింగ్ చేపడుతున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మావోయిస్టుల కదలికలను గుర్తించి ఎన్‌కౌంటర్లు, అరెస్టులు, లొంగుబాట్లకు కేంద్రం ప్రాధాన్యత ఇస్తోంది. 2014లో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 126 ఉండగా, 2025 నాటికి ఆ సంఖ్య 11 జిల్లాలు మాత్రమే ఉంది. అత్యంత ప్రభావిత జిల్లాలు 36 నుంచి 3 జిల్లాలకు తగ్గాయి. ఈ ఏడాదిలోనే 317 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో మృతి, 862 మంది అరెస్టు. 1973 మంది లొంగుబాటు అయ్యారు. ఒక్క అక్టోబర్ నెలలోనే ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో 258 మంది మావోయిస్టులు లొంగిపోయారు.

అగ్రనేతలే టార్గెట్..

2024 నుంచి ఇప్పటివరకు హిడ్మా వంటి కీలక నేతలతో సహా 28 మంది అగ్రనేతలు ఎన్‌కౌంటర్లలో మృతి చెందారు. ఇది మావోయిస్టు ఉద్యమం బలహీనపడటానికి ప్రధాన కారణంగా కేంద్రం పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో తాజాగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ (యూ) మండలంలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు పట్టుబడ్డారు. సోమవారం రాత్రి సిర్పూర్ అడవుల్లో పోలీసులు కూంబింగ్ నిర్వహించిన పోలీసులు 16 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్నవారిలో మావోయిస్టు అధినేత చొక్కరావును ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే అనేక మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందగా.. భారీ సంఖ్యలో మావోలు లొంగిపోయారు. ఇప్పుడు తాజాగా మావోయిస్టు కీలక నేత పోలీసులకు చిక్కినట్లు తెలుస్తోంది. దాదాపు 60 ఏళ్ల చరిత్ర కలిగిన మావోయిస్టు సాయుధ ఉద్యమం ప్రస్తుతం అంతిమ దశకు చేరుకుంటోందని కేంద్రం అభిప్రాయపడుతోంది. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిస్టుల ఉనికిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయని హోంశాఖ స్పష్టం చేసింది.

“



రానున్న ఐపీఎల్‌సీజనే ధోనీకి చివరిది. ఆపై ఎడిషన్‌లో ఆడతారని తాను అనుకోవట్లేదు. ప్రస్తుతం జట్టు కూర్పు చూస్తే అదే అర్థమవుతోంది. గతేడాది, తాజాగా జరిగిన మినీ వేలంలోనూ యంగ్ క్రికెటర్లపై సీఎస్కే ఎక్కువగా ఖర్చు చేసింది. అలాగే రుతురాజ్, శాంసన్ వంటి సారథులు జట్టులో ఉన్నారు. ఈ క్రమంలో ధోనీ టీం నుంచి తప్పుకొని మెంటార్‌గా కొనసాగే అవకాశాలున్నాయి.

- సీఎస్కే మాజీ ఆటగాడు రాబిన్ ఊతప్ప

రాష్ట్రీయం

కాంగ్రెస్ అరాచకాలను ఉపేక్షించం

- దాడికి ప్రతిదాడి తప్పదు: కేటీఆర్
- పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం
- చికిత్స పొందుతున్న బాధితులకు పరామర్శ
- వైద్య ఖర్చులు పార్టీనే భరిస్తుందని భరోసా



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 16: ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని సోమార్‌పేట్ గ్రామంలో కాంగ్రెస్ నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడి, సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ నాయకులు బిట్ల బాలరాజు, ఆయన భార్య గంజి భారతిలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం పరామర్శించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తో కలిసి ఆసుపత్రికి వెళ్లిన కేటీఆర్, బాధితుల ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ గూండాల దాడిలో గాయపడ్డ గంజి భారతి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఆమె పెల్విస్ ఎముకలు విరిగిపోయాయని, యూరినరీ బ్లాడర్ దెబ్బతిన్నదని డాక్టర్లు తెలిపారు. ఆమెకు మూడు శస్త్రచికిత్సలు చేయాల్సి ఉందని, కనీసం మూడు వారాల పాటు ఆసుపత్రిలోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది" అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా, అమానవీయంగా ఉందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "డీజీపీ నుండి కింది స్థాయి పోలీసు అధికారుల వరకు అందరికీ గుర్తుచేస్తున్నా... మీకు జీతాలు ఇస్తున్నది ప్రజల సొమ్ముతోనే తప్ప, రేవంత్ రెడ్డి ఇంట్లో సొమ్ముతోనో, కాంగ్రెస్ పార్టీ సొమ్ముతోనో కాదు. ప్రజల ప్రాణాలు పోతుంటే, రౌడీలు దాడులు చేస్తుంటే పోలీసులు చేష్టలుడిగి చూడటం పద్ధతి కాదు" అని హెచ్చరించారు.

దాడికి ప్రతిదాడి తప్పదు

పోలీసులు నిశ్చేష్టులుగా వ్యవహరిస్తూ, నిందితులపై చర్యలు తీసుకోకపోతే తాము కూడా తిరగబడాల్సి వస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. "ఇక దాడికి ప్రతిదాడే సమాధానం అనుకుంటే, రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య తలెత్తుతుంది. అప్పుడు జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి" అని హెచ్చరించారు. భారతి, బాలరాజులపై దాడి చేసిన వారితో పాటు, దాడికి ప్రేరేపించిన వారిపై కూడా వెంటనే హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ అరాచకాలపై ధ్వజం

గత రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులకు తెగబడుతోందని కేటీఆర్ ఆరోపించారు. నల్గొండలో మల్లయ్య యాదవ్ హత్య, సూర్యాపేటలో బీసీ అభ్యర్థిని కిడ్నాప్ చేసి మూత్రం తాగించిన ఘటనలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారని అన్నారు. గాయపడిన భారతి కుటుంబానికి, ఇతర కార్యకర్తలకు అయ్యే పూర్తి వైద్య ఖర్చులను బీఆర్ఎస్ పార్టీనే భరిస్తుందని కేటీఆర్ హామీ ఇచ్చారు. కార్యకర్తలు అధైర్యపడవద్దని, అవసరమైతే డీజీపీ, ఎస్పీ కార్యాలయాల ముట్టడికైనా పిలుపునిస్తామని, న్యాయం జరిగే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి తన భాషతో కార్యకర్తలను రెచ్చగొట్టడం మానుకోవాలని హితవు పలికారు.

పెరిగిన వాయు కాలుష్యానికి నిరసనగా...

- ఎలక్ట్రిక్ బైక్‌పై పార్లమెంట్‌కు పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ



ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్16 : దేశ రాజధాని ఢిల్లీలో నానాటికి తీవ్రమవుతున్న వాయు కాలుష్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తానే స్వయంగా డిజైన్ చేసి తయారు చేసిన ఎలక్ట్రిక్ బైక్‌పై పార్లమెంట్ కు వచ్చారు. పర్యావరణహిత రవాణా వ్యవస్థల వినియోగమే కాలుష్య నివారణకు మార్గమని ఆయన ఈ చర్య ద్వారా బలమైన సందేశం ఇచ్చారు. వాహనాల వల్ల పెరుగుతున్న కార్బన్ ఉద్గారాలే ఢిల్లీలో వాయు కాలుష్యానికి ప్రధాన కారణమని పేర్కొన్న ఎంపీ వంశీకృష్ణ, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ద్వారా ఇంధన వినియోగం తగ్గడంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని అన్నారు. ప్రజాప్రతినిధులు ముందుండి మార్పుకు దారితీయాలని, ప్రజలంతా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. తానే తయారు చేసిన ఎలక్ట్రిక్ బైక్‌తో పార్లమెంట్‌కు రావడం ద్వారా స్వదేశీ సాంకేతికత, ఆవిష్కరణలు, యువత నైపుణ్యాలను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.




పారిశ్రామిక అభివృద్ధికి బాట నిమ్జ్ భూసేకరణకు వేగం

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 16: జిల్లాలో అమలవుతున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్ జోన్ (నిమ్జ్)తో పాటు తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఐఐసీ) ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిమ్జ్, రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులతో భూసేకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసి, రైతులకు చెల్లించాల్సిన పరిహారం సకాలంలో అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిమ్జ్ ఫేజ్-I పరిధిలో మిగిలి ఉన్న భూముల స్వాధీనాన్ని వేగవంతం చేసి, నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ)కు వెంటనే అప్పగించాలని సూచించారు. ఫేజ్-Iలో బర్దిపూర్, యెల్గోయి గ్రామాల్లో కొంత భూమి ఇంకా స్వాధీనం కావాల్సి ఉందని, అలాగే ఫేజ్-II పరిధిలోకి వచ్చే హద్నూర్ గ్రామంలోని కొంత భాగాన్ని కూడా ఎన్ఐసీడీసీ అవసరాల కోసం భూసేకరణ పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఇప్పటికే ఎన్ఐసీడీసీ కు అవసరమైన భూమిలో సుమారు 93 శాతం భూమిని స్వాధీనం చేసుకుని టీజీఐఐసీకి అప్పగించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన భూముల స్వాధీనాన్ని త్వరగా పూర్తి చేసి, ప్రాజెక్టు పురోగతికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. భూసేకరణను వేగంగా పూర్తి చేయడమే కాకుండా రైతులకు తక్షణమే ప్రయోజనం అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ రతన్ రాథోడ్, నిమ్జ్ డిప్యూటీ తహసీల్దారు ఆనంద్ కుమార్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సిడ్నీ ఉగ్రవాది సాజిద్ అక్రమ్ హైదరాబాద్ వాడే!

- హైదరాబాద్ లో కలకలం.. రాష్ట్ర ఇంటెలిజెన్స్‌ఆరా



ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్16: ఆస్ట్రేలియాలోని సిడ్నీ బాండి బీచ్‌లో డిసెంబర్ 14న జరిగిన ఉగ్రదాడిలో 15 మంది మరణించగా, 40 మందికి పైగా గాయపడ్డారు. యూదుల హనుక్కా వేడుకలను లక్ష్యంగా చేసుకుని తండ్రీకొడుకులు సాజిద్ అక్రమ్ (50), నవీద్ అక్రమ్ (24) కాల్పులు జరిపారు. సాజిద్ ఘటనా స్థలంలోనే పోలీసుల కాల్పుల్లో మరణించగా, నవీద్ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సాజిద్ అక్రమ్ హైదరాబాద్‌కు చెందినవాడు కావడం ఇప్పుడు సంచలనంగా మారింది. తెలంగాణ డీజీపీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం..1998లో స్టూడెంట్ వీసాపై ఆస్ట్రేలియాకు వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. ఆ తర్వాత యూరోపియన్ సంతతికి చెందిన మహిళను వివాహం చేసుకున్నాడు. నవీద్ ఆస్ట్రేలియాలోనే జన్మించిన పౌరుడు. సాజిద్ వద్ద హైదరాబాద్ నుంచి జారీ చేసిన భారత పాస్‌పోర్ట్ ఉన్నట్టు ఆస్ట్రేలియా, ఫిలిప్పీన్స్ అధికారులు గుర్తించారు. దాడికి ముందు నవంబర్‌లో తండ్రీకొడుకులు ఫిలిప్పీన్స్‌కు వెళ్లి వచ్చారు. అక్కడ ఐఎస్ ఐఎస్ సంబంధిత ప్రాంతాల్లో శిక్షణ తీసుకున్నారనే అనుమానాలు ఉన్నాయి. వారి వాహనంలో ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోసివ్ డివైస్‌లు, హోమ్‌మేడ్ ఐఎస్ ఐఎస్ జెండాలు లభ్యమయ్యాయి. దాడి ఉగ్రవాద భావజాలం ప్రేరేపితమని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ప్రకటించారు.ఈ ఘటనపై భారత నిఘా సంస్థలు సాజిద్ కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్నాయి. విషయం తెలిసిన హైదరాబాద్‌లోని అతడి బంధువులు షాక్‌కు గురయ్యారు.

వీబీజీరామ్‌జీ బిల్లు 2025ను రద్దు చేయాలి

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్16: బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో వికసిత్ భారత్ - రోజ్‌గార్ మరియు ఆజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లు 2025 (వీబీజీరామ్‌జీ బిల్లు)ను తీసుకురావాలనే దుర్మార్గపు చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ రైతు సంఘం తెలిపింది. మహాత్మా గాంధీ పేరును తొలగించి, దాని స్థానంలో జీరామ్‌జీ అనే సంక్షిప్త నామాన్ని తీసుకురావడాన్ని మేము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపింది. దీని వెనుక ఒక దురుద్దేశం ఉందని, ప్రతిపాదిత బిల్లు అసలు చట్టంలోని నిబంధనలను నీరుగార్చడానికి , దాని ద్వారా హామీ ఇవ్వబడిన పని హక్కును పరిమితం చేయడానికి దారితీస్తుందని తెలిపింది. ఈ మోసపూరిత బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది.



40 వేల ఓటర్లకు ఒక డివిజన్ ఏర్పాటు చేయండి

- ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 16 : జీహెచ్ఎంసీ పరిధిలో 1.40 కోట్ల ఓటర్ల కు అనుగుణంగా 300 వార్డులు కేటాయించాలని, ఒక్కో వార్డుకు 40 వేల ఓటర్లు ఉండే విధంగా డివిజన్ కేటాయించాలని ఎమ్మెల్సీ డా.చిన్న మైల్ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ అర్వి కర్ణన్ కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన వార్డుల ప్రిలిమినరి నోటిఫికేషన్ల మీద పలు అభ్యంతరాలను ఆయన దృష్టికి వచ్చారు. అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని వెంటనే పరిశీలించాలని డిమాండ్ చేశాను. స్థానికులు, నాయకులు తెలిపిన అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు. వార్డుల పునర్విభజన ఏ ప్రాతిపదికన చేశారో ఎవరి అభిప్రాయాలను తీసుకొని ముసాయిదా విడుదల చేశారో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉండాలన్నారు. ఇప్పటికైనా రాజ్యాంగబద్ధంగా డివిజన్ల పునర్విభజన చేయాలన్నారు. కనీసం ప్రస్తుత కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, బస్తీ సంఘాలు, కాలనీ పెద్దలు ఇలా ఎవ్వరితో సంప్రదింపులు జరుపకుండా చివరికి ఫీల్డ్ లో ప్రజలతో కూడా మాట్లాడకుండా డివిజన్ల పెంపు, పేర్లు మార్పు చేయాలన్నారు.ఈ అంశం పూర్తిగా ప్రజలకు సంబందించిన అంశం తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. ఇప్పుడున్న 150 డివిజన్లకే అధికారులు లేరని .. సగం కంటే ఎక్కువ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఎంపీలపై మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం

- ప్రధాని మోదీతో భేటీ విషయాలను లీక్ చేసిందెవరు అంటూ ఫైర్



ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబరు16 : ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో తెలంగాణ బీజేపీ ఎంపీల సమావేశంపై వచ్చిన లీకులపై కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ఇటీవల తెలంగాణ బీజేపీ నేతలు సమావేశం అయిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో నేతలకు పలు కీలక అంశాలపై ప్రధాని మోదీ దిశానిర్దేశం చేశారు. అయితే ఈ భేటీలో ప్రస్తావించిన విషయాలు బయటకు వచ్చాయి. ఈ విషయంపై ఢిల్లీ వేదికగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. మోదీతో చర్చించిన విషయాలు బయటకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఎవరో కావాలనే ఈ విషయాలను లీకు చేశారని ఫైర్ అయ్యారు. ఈ సమావేశంలో ప్రస్తావించిన అంశాలను బయటకు చెప్పొద్దని మోదీ చెప్పారని గుర్తుచేశారు కిషన్‌రెడ్డి.కానీ మీటింగ్‌లో జరిగిన విషయాలను బయటకు ఎవరు ఎందుకు చెప్పారని మండిపడ్డారు. వారెవరో చెబితే వారిపైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధాని మోదీ మీటింగ్‌లో సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలని మాత్రమే చెప్పారని పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీని మరింతగా బలోపేతం చేయాలని మోదీ కోరారని అన్నారు. దక్షిణాది నుంచి ఇప్పటివరకు ఇద్దరు ఉపరాష్ట్రపతులు అయ్యారని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు.

రాహుల్ వ్యాఖ్యలపై మండిపాటు..

ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. ప్రధాని మోదీపై రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు సరికాదని అన్నారు. ఆయన అనైతికంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ స్థాయిని తగ్గించేలా రాహుల్ వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ విపక్ష నేతగా ఉండటం దురదృష్టకరమని కిషన్‌రెడ్డి విమర్శించారు.

19న అంబేద్కర్‌యూనివర్సిటీలో

జాతీయ సదస్సు

- "దక్షిణ భారతదేశ భాషలు: గుర్తింపు, రాజకీయాలు" అనే అంశంపై చర్చ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 16: డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మరో ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి వేదిక కానుంది. "దక్షిణ భారతదేశ భాషలు-గుర్తింపు, రాజకీయాలు" పేరుతో ప్రతిష్ఠాత్మక జాతీయ సదస్సును 19న నిర్వహించనున్నారు. ఈ సదస్సులో మేధావులు, పరిశోధకులు, జర్నలిస్టులు పాల్గొంటున్నారు. దక్షిణ భారతదేశ భాషల విషయంలో భాషా సార్వభౌమత్వం, సమాఖ్య సూత్రాలు, ప్రజాస్వామ్య బహుళత్వం అనే అంశాలపై ఈ సదస్సులో వక్తలు, మేధావులు లోతుగా చర్చించనున్నారు. ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ సదస్సును ప్రారంభిస్తారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఘంటా చక్రపాణి అధ్యక్షత వహిస్తారు. ప్రముఖ పరిశోధకుడు, రచయిత, ఆంధ్రజ్యోతి దినపత్రిక పూర్వ సంపాదకులు డాక్టర్ కే. శ్రీనివాస్ కీలకోపన్యాసం చేస్తారు.





గతంలో అధికారులు అక్రమ షెడ్డును కూల్చివేస్తున్న దృశ్యం

అయినా మళ్లీ జరుగుతున్న నిర్మాణ పనులు

డిప్యూటీ కమిషనర్ జ్యోతి

అసలీ భూములు ఎవరివి..?

- శ్రీరామచంద్రునికి చెందుతాయా..
- రైతులకు చెందుతాయా..?
- దేవరాయంజాల్ భూములపై నిగ్గు తేలేనా?
- 1925/ 1926 భూ రికార్డ్ ప్రకారం 1521 ఎకరాల స్థలం దేవుడి పేరుపైనే ఉంది.
- 1934/1935లో రైతుల పేరు పైకి ఎలా మారిందో ?

ప్రతిపక్షం ప్రతినిధి. మేడ్చల్, డిసెంబర్ 16: మనం దేవుడు ఉన్నాడని నమ్ముతాం.. ఆపదలో ఉంటే దేవుడే దిక్కు అనుకుంటాం.. ఖచ్చితంగా ఆయన ఆదుకుంటాడు అని విశ్వసిస్తాం.. కానీ ఇప్పుడు నడుస్తున్నది కలికాలం.. ఆ దేవదేవుడికి చెందిన భూములకు సమస్య వచ్చింది.. ఆ సమస్య ఇప్పుడు న్యాయస్థానం పరిధిలో వుంది.. మరి ఇప్పుడు ఆ దేవుడి భూములకే సమస్య వచ్చింది.. మరి ఈ సమస్యను తీర్చే నాథుడు ఎవరు..? ఎక్కడున్నాడు..? కొన్ని కథలు వింటుంటే అర్థం అవుతుంటాయి.. కొన్ని కళ్ళతో చూస్తే అర్థం అవుతాయి.. ఈ భూముల కథ 1925 నుంచి ఇప్పటివరకు అర్థం కాని ప్రశ్నగా మిగిలింది. మేడ్చల్ జిల్లా తుంకుంట సర్కిల్ దేవరాయంజాల్ లో ప్రభుత్వ అధికారులు రిటైర్డ్ అవుతున్నారు.. కానీ దేవరాయంజాల్ శ్రీ సీతా రామచంద్రుడి సంబంధించిన భూముల సమస్య మాత్రం మిస్టరీగానే మిగిలిపోయింది. ఇప్పటికి కోర్టు పరిధిలో భూ సమస్య న్యాయస్థానం తేల్చుకుముందే ఎలాంటి అనుమతులు లేకుండా సాఫీగా సాగుతున్న అక్రమ దందా నిర్మాణాల జోరందుకుంటుందని చెప్పుకుంటే అవునని చెప్పుకోవచ్చు. సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ దృష్టికి దేవరాయంజాల్ కథ వెళ్లేనా.. అవి దేవుడికి సంబంధించిన భూములు అంటూ ప్రభుత్వ అధికారులు.. లేదు ఆభూములు మావే అంటూ రైతులు, స్థానిక ప్రజలు వాదిస్తుండగా ఈ వివాదం కాస్తా న్యాయస్థానానికి చేరింది.. ప్రస్తుతం ఈ వ్యవహారం హైకోర్టులో విచారణలో ఉంది. అయితే ఇటు ప్రభుత్వం.. అటు న్యాయస్థానం ఈ దేవరయాంజాల్ భూముల వ్యవహారం ఎటూ తేల్చకముందే.. ఈ భూముల్లో అక్రమ కట్టడాలు.. అనుమతులు లేని పెద్ద పెద్ద గోదాంలు ఇబ్బడి ముబ్బడిగా వేలుస్తున్నాయి . ప్రేక్షక పాత్ర పోషిస్తున్న తూముకుంట సర్కిల్ అధికారులు ఓ అధికారికి కాంగ్రెస్ నేత పోస్టింగ్ ఇప్పించడంతో దేవరాయంజాల్ అక్రమ షెడ్డుల నిర్మాణాల వద్దకు వెళ్లడం లేదని బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరి దీనిపై జోనల్ కమిషనర్ దృష్టి సారిస్తారా వేచి చూడాల్సిందే.



కాంగ్రెస్ హింసా రాజకీయాలను అడ్డుకుంటాం

- మాజీ మంత్రి హరీష్ రావు
- గుమ్మడిదల మండల సర్పంచులకు అభినందన
- కామారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్ నేత ఇంటిపై దాడి రౌడీయిజానికి పరాకాష్ట

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 16: డబ్బు, ప్రలోభాలు లేకున్నా, పోలీసులను అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడినా క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ సత్తా చాటిందని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలో బీఆర్ఎస్ బలపరిచి విజయం సాధించిన నలుగురు సర్పంచులు వీరారెడ్డిపల్లి బుద్ధుల దుర్గ, నాగిరెడ్డిగూడెం గడ్డం లావణ్య, కొత్తపల్లి సూరారం మంజుల, అనంతరం కొమ్ము శ్రీనివాస్ ఈరోజు హైదరాబాద్ లో హరీష్ రావు ను మర్యాదపూర్వకంగా కలిశారు. పటాన్ చెరు బీఆర్ఎస్ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో వచ్చిన విజేతలను హరీష్ రావు శాలువాలతో సత్కరించి అభినందించారు. నీతిగా, న్యాయంగా గెలిచిన మీ విజయం గొప్పది. మనమంతా కేసీఆర్ సైనికులం. కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దు, కాంగ్రెస్ వేధింపులకు వడ్డీతో సహా తిరిగి చెల్లిద్దాం అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి హింసా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు. నిన్న కామారెడ్డి జిల్లా సోమార్పేట్ లో బీఆర్ఎస్ నేత బిట్ల రాజు ఇంటిపై కాంగ్రెస్ సర్పంచ్ ట్రాక్టర్ తో దాడి చేయడం రౌడీయిజానికి పరాకాష్ట. మొన్న నల్గొండ హత్య, నేడు కామారెడ్డి దాడి చూస్తుంటే హోం మంత్రిగా రేవంత్ పూర్తిగా విఫలమయ్యారని స్పష్టమవుతోంది. దాడికి పాల్పడిన వారి పై చర్యలు తీసుకోవాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

“



మెడికల్ కాలేజీల విషయంలో ప్రజా మద్దతు లేక వైసీపీ చీఫ్ జగన్ కోడి గీతలతో కోటి సంతకాల డ్రామా ఆడుతున్నారు. ప్రజారోగ్యం, విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా పది వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో నడపాలని ప్రభుత్వం నిర్ణయించింది. జగన్ దాన్ని ప్రైవేటీకరణగా వక్రీకరిస్తున్నారు. కేంద్రం, కోర్టులు పీపీపీని సమర్థించాయి. దీనిపై జగన్ కోర్టుకెళ్తేనే మేలు.

- ఏపీ మంత్రి సత్యకుమార్

ఓపెన్ వాయిస్

పర్యాటకం



రామగిరి కోట అందాలు చూడతారమా..!



అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం పచ్చజెండా.. రూ.5,000 కోట్లు కేటాయింపు,, పర్యాటక రంగానికి నూతన ఊపిరి

రోడ్లు, రోప్‌వే ప్రతిపాదనలు.. ఎంపీ వంశీకృష్ణ చొరవతో ఫలిస్తున్న అభివృద్ధి పనులు

వడ్లకొండ సదానందం
ప్రతిపక్షం బ్యూరో, ఉత్తర తెలంగాణ, కరీంనగర్

పెద్దపల్లి జిల్లాలోని రామగిరి కోట అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చారిత్రక ప్రాధాన్యత కలిగిన రామగిరి ఖిల్లా అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులను కేటాయించింది. ఈ నిధులతో పర్యాటక అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయి. ముఖ్యంగా రోడ్డు నిర్మాణాలు, రోప్‌వే ఏర్పాటు వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు ప్రతిపాదన దశలో ఉండగా, రామగిరి కోటను జాతీయ స్థాయిలో మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

పార్వతమాల ప్రాజెక్ట్‌లో భాగంగా రోప్‌వే

కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పార్వతమాల ప్రాజెక్టులో భాగంగా రామగిరి ఖిల్లాకు రోప్‌వే ఏర్పాటు చేసేందుకు కేంద్రం అనుమతి ఇవ్వడం విశేషం. దీని ద్వారా కొండపైకి చేరుకోవడం సులభమవుతుందని, వృద్ధులు, పిల్లలు, పర్యాటకులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కోటను సందర్శించగలరని అధికారులు చెబుతున్నారు. ఈ రోప్‌వే ప్రాజెక్టుతో రామగిరి ఖిల్లా పర్యాటక పటంలో మరింత బలంగా నిలవనుంది.

రోడ్ల నిర్మాణంతో సౌకర్యవంతమైన రాకపోకలు

కేటాయించిన నిధులతో కోట కింద వరకు రెండు వైపులా రోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ప్రస్తుతం కొండ ప్రాంతం కావడంతో రాకపోకలు కష్టతరంగా ఉన్న నేపథ్యంలో, కొత్త రోడ్లు పర్యాటకులకు పెద్ద ఊరట కలిగించనున్నాయి. ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి.ఈ మొత్తం అభివృద్ధికి ప్రధాన కారణంగా స్థానిక ఎంపీ వంశీకృష్ణ చొరవను రాజకీయ వర్గాలు, స్థానికులు ప్రశంసిస్తున్నారు. రామగిరి కోటకు ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను కేంద్ర ప్రభుత్వానికి వివరించి, నిధుల కేటాయింపులో కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. ఎంపీ వంశీకృష్ణ నిరంతర ప్రయత్నాల ఫలితంగానే ఈ ప్రాజెక్టులు కార్యరూపం దాల్చుతున్నాయని అధికారులు వెల్లడిస్తున్నారు.

చారిత్రక ప్రాధాన్యత

రామగిరి ఖిల్లాకు ఎంతో విశిష్టమైన చరిత్ర ఉంది. చరిత్రకారుల కథనం ప్రకారం ఈ కోట క్రీ.శ. 1వ శతాబ్దంలో నిర్మించబడింది. అనేక రాజవంశాల పాలనకు సాక్ష్యంగా నిలిచిన ఈ కోట ప్రాంతం, పురాతన శిల్పకళకు అద్దం పడుతోంది. అంతేకాకుండా ఇక్కడ శ్రీరాముడి ఆలయం ఉండటం వల్ల ఈ ప్రాంతానికి ఆధ్యాత్మిక ప్రాధాన్యత కూడా అధికంగా ఉంది.

ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి లక్ష్యం


రామగిరి ఖిల్లాను ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యంగా ఉంది. చారిత్రక వారసత్వం, ప్రకృతి సౌందర్యం, ఆధ్యాత్మిక విశిష్టత—ఈ మూడింటి సమ్మేళనంగా రామగిరి కోటను దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చేయాలనే దిశగా చర్యలు సాగుతున్నాయి. భవిష్యత్‌లో మరిన్ని సౌకర్యాలు, పర్యాటక మౌలిక వసతులు కల్పించే అవకాశాలు కూడా ఉన్నట్లు అధికారులు సూచిస్తున్నారు.


భవిష్యత్‌లో మరింత వెలుగులోకి రామగిరి


రూ.5 కోట్ల నిధులతో ప్రారంభమయ్యే ఈ అభివృద్ధి పనులు రామగిరి ప్రాంతానికి ఆర్థికంగా, పర్యాటకంగా కొత్త దిశను చూపనున్నాయి. స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, రామగిరి ఖిల్లా తెలంగాణలోనే కాకుండా జాతీయ స్థాయిలో ఒక ముఖ్యమైన పర్యాటక కేంద్రంగా నిలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి.











రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

మూడవ విడత ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- **జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె. హైమావతి**



ప్రతిపక్షం సిద్దిపేట, డిసెంబర్ 16: మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొండపాక సమీకృత కార్యాలయ సముదాయం, కుకునూరుపల్లి మండల కేంద్రంలోని కోలా అంజయ్య ఫంక్షన్ హాల్, కొమురవెల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చేర్యాల మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, మద్దూరు మండలంలోని తాజ్ ఫంక్షన్ హాల్‌లలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్టేట్ ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను పూర్తి స్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కొండపాక మండలంలో ఏర్పాటు చేసిన పంపిణీ, స్వీకరణ కేంద్రాల ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారులను అభినందించారు. పోలింగ్ స్టేషన్లలో బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు, ఇతర పోలింగ్ మెటీరియల్‌ను సరిగా పరిశీలించి, సందేహాలు ఉంటే మాస్టర్ ట్రైనర్లను సంప్రదించాలని సూచించారు. పోలింగ్ రోజు ఉదయం మాక్ పోలింగ్ పూర్తి చేసి ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రారంభించాలని, ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతాన్ని నివేదించాలని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ ప్రారంభించి ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు చేపట్టాలని, కౌంటింగ్ ప్రక్రియను వీడియోగ్రఫీతో పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. అబ్జర్వర్ అనుమతితోనే ఫలితాలు విడుదల చేయాలని స్పష్టం చేశారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో ఓటర్ స్లిప్‌లను బీఎల్‌ఓలు 100 శాతం పంపిణీ చేయాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో పంచాయతీ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు చంద్రకళ, సదానందం, ఆయా మండల ఎంపీడీవోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



ముదిరాజుల 75 ఏళ్ల కల నెరవేర్చిన ఇట్టబోయిన శ్రీనివాస్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 16: స్వతంత్రం వచ్చిన నాటి నుంచి 75 సంవత్సరాలుగా చిన్నకోడూరులో ముదిరాజులకు సర్పంచ్ పదవి దక్కలేదని, ఆ లోటును మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే హరీష్ రావు సహకారంతో ముదిరాజ్ బిడ్డ ఇట్టబోయిన శ్రీనివాస్ సర్పంచ్‌గా గెలుపొందడంతో తీర్చగలిగామని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం చిన్నకోడూరు మండల కేంద్రంలోని పెద్దమ్మ ఫంక్షన్ హాల్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ఇట్టబోయిన శ్రీనివాస్ కి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ...తరాలు మారినా తలరాతలు మారలేదని, చిన్నకోడూరులో ముదిరాజులు సర్పంచ్‌గా గెలవడానికి 75 సంవత్సరాలు పట్టిందన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు సహకారం, ముదిరాజుల ఐక్యతతో పాటు గ్రామంలోని ఇతర కుల సంఘాల సభ్యుల మద్దతుతో ఇట్టబోయిన శ్రీనివాస్ అత్యధిక మెజారిటీతో విజయం సాధించారని తెలిపారు. గ్రామంలోని అన్ని కుల సంఘాల సభ్యులకు శిరసు వంచి కృతజ్ఞతలు తెలుపుతూ, ఇలాంటి పరస్పర అభిమానము ఎల్లవేళలా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కాముని శ్రీనివాస్, మాజీ ఎంపీపీ తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ ఉమేష్ చంద్ర, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, చెరుకు పెద్దలు బైరి యాదగిరి, గ్రామ సర్పంచ్ ఇట్టబోయిన శ్రీనివాస్, ఉప సర్పంచ్ కన్నారెడ్డి, తడకమడ్ల శ్రీకాంత్, కాల్వ ఎల్లయ్య, కోరబోయిన శ్రీనివాస్, జంగిటి ఆనందం, కుందేళ్ళ దశరథం, దేశెట్టి స్వామి, పెసరు భాస్కర్, గుండు భాస్కర్, బంకపోచయ్య, అంబటి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో భారీ చేరికలు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 16: సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. చిన్నకోడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మీసం మహేందర్ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్, మాజీ సర్పంచ్, వార్డ్ మెంబర్లు తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ సమక్షంలో పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, ప్రజాపాలనలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి అధికార పార్టీలో చేరినట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధి అధికార పార్టీతోనే సాధ్యమని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో అల్లీపూర్ ఉప సర్పంచ్ కోలన్‌పాక శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ కామ నిలయ్య బుజ్జమ్మ, వార్డ్ మెంబర్లు మంకాళి మహేష్, మీసం ఎల్లవ్వ పోచయ్య, బీఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు ఎర్ర బాలయ్య, లింగంపల్లి రాజయ్య, యువజన నాయకుడు ఎర్ర అజయ్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.



జిల్లాలో కోవర్టుల వల్ల పార్టీకి తీవ్ర నష్టం

- **కాంగ్రెస్ పార్టీ నుండి కోవర్టులు బయటకు వెళ్ళండి**
- **మెదక్ మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు**

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ డిసెంబర్ 15 : కాంగ్రెస్ పార్టీలో పని చేస్తూ మాజీ మంత్రి హరీష్ రావుకు కోవార్డులుగా పనిచేస్తున్నారని వారు వెంటనే కాంగ్రెస్ పార్టీ నుండి బయటకు వెళ్లాలని. కోవర్టుల మూలంగా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా నష్టపోతుందని ఇది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కోవార్డులు ఉన్నారని మెదక్ మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు సంచలన ఆరోపణలు చేశారు. మెదక్ జిల్లా నిజాంపేట మండలం కల్వకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ఉమ్మడి మెదక్ జిల్లాలో హరీష్ రావు పెత్తనం, పోలీస్ కమాండింగ్ చేస్తున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాను అడ్డు పెట్టుకొని కాంగ్రెస్ పార్టీపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న కోవర్టులు బయటకు వెళ్లాలని చెప్పిన వారు బయటకు వెళ్లడం లేదని మండిపడ్డారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై కఠిన చర్యలు

- **పోలీస్ కమిషనర్ విజయ్‌కుమార్**



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 16: సిద్దిపేట్ జిల్లాలో ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీస్ కమిషనర్ ఎస్.ఎం. విజయ్ కుమార్ తెలిపారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా విజయోత్సవాల్లో పటాకులు కాల్చడం, అనుమతి లేని ర్యాలీలు నిర్వహించడం, అలాగే ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ అధికారుల పనికి ఆటంకం కలిగిస్తే తప్పనిసరిగా కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. మొదటి దశ ఎన్నికల రోజున నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి మొత్తం 20 కేసులు, రెండవ దశ ఎన్నికల రోజున 13 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో మూడవ దశ ఎన్నికలు జరుగుతున్న మండలాల్లో బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమలులో ఉన్నందున, ఒకే చోట ఐదుగురు కంటే ఎక్కువ మంది గుమికూడరాదని స్పష్టం చేశారు. అలాగే విజయం సాధించిన అనంతరం ఎటువంటి ర్యాలీలు లేదా ఊరేగింపులకు అనుమతి లేదని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, ప్రజలు ఎన్నికల నియమావళిని పాటించి శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని ఆయన కోరారు.



పోలింగ్, కౌంటింగ్ సజావుగా నిర్వహించాలి

- **పోలింగ్ కేంద్రాల వద్ద బిఎస్ఎన్ 163 చట్టం అమలు**
- **జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్**

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 16: శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలింగ్ జరిగే మండలాల్లో, గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బిఎస్ఎన్ 163 చట్టం అమల్లో ఉంటుందని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. మంగళవారం కొల్చారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర గార్డెన్లో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ సెంటర్ ను గ్రామ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 161 సర్పంచ్ స్థానాలకు, 1220 వార్డు స్థానాలకు మూడో విడత ఎన్నికలకు ఏర్పాటులు పూర్తి చేయడం జరిగిందని, విధులు నిర్వహించే అధికారులు క్రమశిక్షణగా విధులు నిర్వహించడానికి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి బ్యాలెట్ బాక్సులతో బయలుదేరడం జరిగిందని, పోలింగ్ స్టేషన్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మొదటి రెండో విడత పోలింగ్ నమోదులో మెదక్ జిల్లా 89% నమోదయిందని రాష్ట్రంలో 05 స్థానంలో ఉన్నదన్నారు. పెద్ద ఎత్తున ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకుని ఓటింగ్ శాతం నమోదులో మన జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. గ్రామ పంచాయితీ ఎన్నికలను విజయవంతం చేసేందుకు విధులు నిర్వహించే అధికారులు పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని సూచించారు. ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది తమకు ఇచ్చే పోలింగ్ సామాగ్రిని చెక్ లిస్ట్తో సరిచూసుకోవాలని, ఏమైనా సామాగ్రి లేకుంటే వెంటనే రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకొస్తే ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామ పంచాయతీలలోని పోలింగ్ స్టేషన్లకు వెళ్లాక ఇబ్బంది పడకుండా పోలింగ్ నిర్వహణకు అవసరమైన ప్రతి ఒక్క వస్తువును ప్రిసైడింగ్ అధికారులు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. సైలెన్స్ పీరియడ్‌లో ప్రజలు గుంపులుగా చేరరాదని స్పష్టం చేశారు. పోలింగ్‌కు ముందు మరియు పోలింగ్ సమయంలో యంత్రాంగం పటిష్ఠ పర్యవేక్షణ చేపట్టాలని, ఎలాంటి ఎన్నికల ఉల్లంఘనలు జరుగకుండా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని, ఏదేని ఉల్లంఘన జరిగినట్లు గమనిస్తే ఎన్నికల సంగం ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకోబడునని అన్నారు. 15 సాయంత్రం ఐదు గంటల నుండి 163 బి. ఎన్.ఎస్ చట్టం 18 వ తారీకు ఉదయం 10 గంటల వరకు ఉంటుందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ ఎన్నికల సంగం మార్గదర్శకాలు పాటించాలని ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కారును ఢీ కొట్టిన బైక్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 16: మెదక్ పట్టణంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలో మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కార్యాలయం ఎదుట రోడ్డుపక్కన ఆగి ఉన్న కారును ద్విచక్ర వాహనదారుడు మద్యం మత్తులో అదుపు తప్పి వేగంగా వచ్చి ఢీకొట్టాడు. కారు ముందు భాగం దెబ్బతినగా, ప్రమాద సమయంలో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న వ్యక్తి మద్యం సేవించి ఉండటంతో వాహనంపై నియంత్రణ కోల్పోయినట్లు స్థానికులు తెలిపారు. ఢీకొన్న సమయంలో ద్విచక్ర వాహనదారుడు రోడ్డుపై పడిపోవడంతో అతడికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 కు కాల్ చేసి గాయపడిన వ్యక్తిని సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



అబాకస్, వేదిక్ మ్యాథ్స్‌తో విద్యార్థుల్లో నైపుణ్యం

- **విశ్వం అబాకస్ వేదిక్ మ్యాథ్స్ జిల్లా స్థాయి పోటీలు**

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్16: అబాకస్, వేదిక్ మ్యాచ్ ద్వారా గణితశాస్త్రంలో విద్యార్థులు ప్రావీణ్యం సాధించడం జరుగుతుందని విశ్వం ఎడ్యుకేషనల్ రీజినల్ హెడ్ వినాయక్ అన్నారు. మంగళవారం సిద్దిపేటలో విశ్వం ఎడ్యుకేషనల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అబాకస్ వేదిక్ మ్యాస్ జిల్లా స్థాయి పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నుంచి 30 పాఠశాలలకు సంబంధించి 650 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రథమ ద్వితీయ బహుమతుల్లో గెలుపొందిన 26 మంది విజేతలకు బహుమతులను అందజేశారు. విజేతలు గాని ఇచ్చినవారు జనవరిలో జరిగే స్టేట్ లెవెల్ పరీక్షలలో పాల్గొంటారని వినాయక్ తెలిపారు. కార్యక్రమంలో మోటివేషన్ స్పీకర్ శ్రీహరి, విశ్వం టీం సభ్యులు మహేష్ వేణు సాగర్ సురేందర్ సూరజ్ కిషోర్ నాగరాజు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్, ఉపసర్పంచ్ లకు ఎమ్మెల్యే సన్మానం



ప్రతిపక్షం,చేగుంట,డిసెంబర్16: చేగుంట, నార్సింగి మండలాలకు చెందిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సన్మానించారు. ఓటమి చవి చూసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులను ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి అభినందించారు. చేగుంట మండలం కొండాపూర్ సర్పంచ్ రాజిరెడ్డి, కర్నాల్ పల్లి సర్పంచ్ రాములు గౌడ్, రాంపూర్ సర్పంచ్ నాగమణి సుదర్శన్, ఇబ్రహీంపూర్ సర్పంచ్ జ్యోతి రామ్ రెడ్డి, గొల్లపల్లి సర్పంచ్ సబితా జనార్దన్ రెడ్డి తదితరులను ఎమ్మెల్యే సన్మానించారు. అలాగే నార్సింగ్ సర్పంచ్ ఆకుల సుజాత, మల్లేశం గౌడ్ లతోపాటు వివిధ గ్రామాల సర్పంచులను ఎమ్మెల్యే సన్మానించారు.

మూడవ విడత ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రత

- **7 మండలాలను 40 రూట్లుగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు**
- **సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాల మోహరింపు**
- **జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు**



ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 16: మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు మెదక్ జిల్లా వ్యాప్తంగా 750 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస రావు, పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించినట్లు తెలిపారు. మూడవ విడత ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో, నిస్పక్షపాతంగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికలను నిర్వహించాలని సూచించారు. శివంపేట్, మండలంలో ఎన్నికల విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందికి శివంపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్.కే. ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఎస్పీ భద్రతాపరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...7 మండలాలను మొత్తం 40 రూట్లుగా విభజించి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే స్పందించేందుకు రూట్ మొబైల్ పార్టీలు, ఇన్స్పెక్టర్ల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్స్, డియస్పి ల ఆధ్వర్యంలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలోని రూట్లు, వాటి పరిధిలో ఉన్న గ్రామాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, అక్కడ నియమించిన పోలీసు అధికారుల వివరాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని, పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రాల వద్ద పాటించాల్సిన నియమాలను వివరించారు. ఎన్నికల సమయంలో సమస్యలు సృష్టించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, పోలింగ్ రోజు నుంచి కౌంటింగ్ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాల వద్ద BNSS సెక్షన్ 163 అమల్లో ఉంటుందని, పోలింగ్ కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో అనవసర వ్యక్తులను అనుమతించకూడదని తెలిపారు. ఓటర్లు సెల్‌ఫోన్లు, వాటర్ బాటిల్స్, ఇంక్ బాటిల్స్, ఇతర హానికర వస్తువులు తీసుకురాకుండా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు విజయోత్సవ ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతి లేదని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డియస్పి నరేందర్ గౌడ్, సీఐ రంగా కృష్ణ, ఎస్బి ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఆర్ఐ శైలందర్, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.



స్వర్ణకారుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 16: ఆర్థిక ఇబ్బందులతో అక్టోబర్ 19న ఆత్మహత్య చేసుకున్న లస్కరి నరేష్ చారి కుటుంబానికి మెదక్ పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సహకారం అందజేశారు. అధ్యక్షుడు ఏలేశ్వరం బ్రహ్మాచారి, ప్రధాన కార్యదర్శి ఇటిక్యాల వేణు చారి, కోశాధికారి సరాఫ్ కాశీనాథం చారి, యువజన సంఘం అధ్యక్షుడు ముక్తాజు రవీందర్ చారి, ఆలయ కమిటీ అధ్యక్షుడు జమ్మికుంట బ్రహ్మాచారి ఆధ్వర్యంలో జమచేసిన రూ.76 వేల ఆర్థిక సహాయాన్ని తల్లికి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్థిక సాయం అందజేసిన దాతలకు నరేష్ చారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



'ఆపరేషన్ సిందూర్'లో మొదటిరోజే భారత్ ఓడింది. ప్రజలు అంగీకరించినా లేకున్నా భారత ఎయిర్ క్రాఫ్ట్‌లు మొదటిరోజు దాడి చేయలేదు. గ్వాలియర్, బరిండా, సిర్సా నుంచి ఎగిరే ఎయిర్‌క్రాఫ్ట్‌లను పాక్ కూల్చేసే ప్రమాదం ఉండడంతో దాడి చేయలేదు. భవిష్యత్తులోనూ వైమానిక, క్షిపణి యుద్ధాలే జరుగుతాయి. 12 లక్షల మంది సైనికులు అవసరమా?.

- కాంగ్రెస్ నేత పృథ్వీరాజ్ చౌహాన్

ప్రాంతీయం



నగరంలో అభివృద్ధి పనుల పురోగతిపై అర్బన్ ఎమ్మెల్యే సమీక్ష

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 16 : నిజామాబాద్ నగరంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, టియుఎఫ్ఐడీ సి ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల పురోగతిపై అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ సమగ్రంగా సమీక్షించారు. సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం సుభాష్ నగర్ లోని అర్బన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆయన అధికారులతో మాట్లాడుతూ నగరంలోని రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ, త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనులు, టి యు ఎఫ్ ఐ డి సి ద్వారా చేపడుతున్న పనుల నాణ్యత, పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టుల పురోగతిపై ఎమ్మెల్యే అధికారులతో విస్తృతంగా సమీక్షించారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే నెంబర్ వన్ గా తీర్చిదిద్దే బాధ్యత నియోజకవర్గానికి చెందిన ప్రతి ఒక్క అధికారి బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. ముఖ్యంగా తన నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్, మున్సిపల్ ఈ.ఈ సుదర్శన్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ డి ఈ ప్రవీణ్, పబ్లిక్ హెల్త్ అధికారి డి ఈ నాగేశ్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ అధికారి ఏఈ శివకృష్ణ తదితర మున్సిపల్, ఆర్ అండ్ బి, పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మూడవ విడత ఎన్నికలకు సర్వం సిద్ధం

- పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి
- పోలింగ్ శాతం రిపోర్ట్ సమయానుసారంగా ఎప్పటికప్పుడు అందించాలి
- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సాంగ్వాన్



ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, డిసెంబర్ 16: 2వ సాధారణ గ్రామ పంచాయితీ ఎన్నికలలో భాగంగా బుధవారం 17వ తేదీన నిర్వహించే మూడవ విడత ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలకు సిబ్బందితో పాటు ఎన్నికల సామాగ్రి బస్సుల ద్వారా తరలించడం జరిగిందనీ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. ఈ సందర్భంగా ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. విధులు నిర్వహించే అధికారులు పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని , ఏమైన సమస్యలు ఎదురైతే తక్షణమే ఉన్నతాధికారులకు తెలియజేయాలని అన్నారు. బాన్సువాడ నియోజకవర్గం లోని బాన్సువాడ మండలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, బిచ్కుంద మండలం, జుక్కల్ మండలాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు, సిబ్బంది తమకు ఇచ్చిన పోలింగ్ సామాగ్రిని చెక్ లిస్ట్ లో చూసుకోవాలని, ఆయా గ్రామ పంచాయతీలలోని పోలింగ్ స్టేషన్లకు చేరుకున్న తర్వాత పోలింగ్ నిర్వహణకు అవసరమైన ప్రతి ఒక్క వస్తువును తమ వద్ద ఉంచుకోవాలన్నారు. రిజర్వ్డ్ కౌంటర్లో ఎంతమంది అధికారులు రిపోర్టు చేసారో పరిశీలించి, అవసరమైన గ్రామ పంచాయితీలలో వారు విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. స్పెషల్ కౌంటర్లో బ్యాలెట్ పేపర్స్ తో పాటు పోలింగ్ కు అవసరమైన వివిధ ఫారాలను, కవర్లను, ఇతర సామాగ్రిని సరిచూసుకోవాలి, పోలింగ్ విధులు నిర్వర్తించే అధికారులు డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో రిపోర్టింగ్ చేశాక రూట్ వారీగా సంబంధిత గ్రామ పంచాయతీలకు పోలింగ్ మెటీరియల్ తో వెళ్లేందుకు జోనల్ అధికారులు సహకరిస్తారన్నారు. ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకొని బుధవారం ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలింగ్ విధులు నిర్వహించే అధికారులు తమకు కేటాయించిన గ్రామ పంచాయతీలకు వాహనాల్లో తరలి వెళ్లే సమయం నుంచి కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేసి తిరిగి రిసెప్షన్ కేంద్రానికి వచ్చేవరకు అవసరమైన పోలీస్ బందోబస్తు నియమించినట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవడం జరిగిందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, సీఈఓ చందర్ ఎన్నికల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నాలుగు మండలాల్లో మూడో విడత ఎన్నికలు

- పోలింగ్ సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది
- ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్

ప్రతిపక్షం, హన్మకొండ, డిసెంబర్16: హనుమకొండ జిల్లాలో మూడో విడత ఎన్నికలు బుధవారం జరుగుతుండగా ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండల కేంద్రంలోని సెయింట్ థెరీసా హైస్కూల్ లో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రాన్ని సందర్శించి మూడో విడత ఎన్నికలలో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి పోలింగ్ మెటీరియల్ పంపిణీ ప్రక్రియ కొనసాగుతుండగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల విధులకు కేటాయించబడిన పిఓ, ఓపిఓల రిపోర్టింగ్ కౌంటర్ ను కలెక్టర్ సందర్శించి అప్పటివరకు ఎంతమంది రిపోర్ట్ చేశారని అడిగి తెలుసుకున్నారు. డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రంలో ఆయా పోలింగ్ కేంద్రాల ఎన్నికల అధికారులను తీసుకున్న పోలింగ్ మెటీరియల్ ను పరిశీలించారా అని రిటర్నింగ్, పోలింగ్ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధులు కేటాయించబడినట్లు మొబైల్ ఫోన్ కు వచ్చిన సందేశాన్ని కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి ఏర్పాటుచేసిన వాహన సదుపాయాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ మెటీరియల్, పోలింగ్, కౌంటింగ్ అంశాల గురించి జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కాగా హనుమకొండ జిల్లాలో మూడో విడత ఎన్నికలు ఆత్మకూర్, దామెర, నడికూడ, శాయంపేట మండలాల్లో గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా సర్పంచ్, వార్డు స్థానాలకు బుధవారం ఉదయం ఏడు నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి కౌంటింగ్ కేంద్రాలలో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మంగళవారం ఆయా మండల కేంద్రాలలో పోలింగ్ సామాగ్రి పంపిణీ కోసం ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల నుండి ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామగ్రిని తీసుకొని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారని తెలిపారు. ఎన్నికల పోలింగ్ ను పటిష్టంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.



పోలింగ్ కేంద్రాల వద్ద 163 (BNS) చట్టం అమలు

గ్రామ పంచాయతీ మూడో విడత ఎన్నికలు జరుగు ఆయా మండలాలు, గ్రామపంచాయతీలలో 163 (BNS) చట్టం పగడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. 163 బీఎన్ఎస్ చట్టం అమలుపై కలెక్టర్ మాట్లాడుతూ మూడో విడత ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి మండలాల్లో సైలెన్స్ పీరియడ్ అమలులోకి వస్తుందని తెలిపారు. ఎన్నికల జరుగు మండలాల్లో పోలింగ్ ముగిసే వరకు ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఏ విధమైన ప్రచారాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఈ కాలంలో బయట నుండి వచ్చిన వ్యక్తులు సంబంధిత గ్రామ పంచాయతీ పరిధిలో ఉండకూడదని తెలిపారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- హాజరైన మంత్రి కొండా సురేఖ

ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబర్16: వరంగల్ తూర్పు నియోజకవర్గం 41వ డివిజన్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కొండా సురేఖ అనంతరం విలేకరుల సమావేశంలో సమావేశంలో మాట్లాడుతూ...తూర్పు నియోజకవర్గం అభివృద్ధిని చేయడమే ధ్యేయమని నియోజకవర్గ ప్రజలే దేవుళ్ళని ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.కొందరు గిట్టని వారు గ్రూప్ రాజకీయాలు చేసినా మా కొండా దంపతులకు ఎటువంటి హాని జరగదని ప్రజల దీవెనలు ఎప్పటికీ మాకే ఉంటాయని అన్నారు.ఉర్సు ఎస్సీ కాలనీలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులను ప్రశంసించారు.మా ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వం అని పేద ప్రజలకు అండగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి,41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ స్వామి గౌడ్,వరంగల్ మున్సిపాలిటీ కమిషనర్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించిన కలెక్టర్


ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 16 : గ్రామ పంచాయతీ మూడవ విడత ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం సందర్శించారు. ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అలూర్, ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీ.ఓ, ఓ.పీ.ఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తేవాలని ఆర్ఓలకు సూచించారు. కాగా, ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్యాంప్రసాద్ లాల్ కలెక్టర్ తో కలిసి అలూర్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను సందర్శించారు. అలాగే, నందిపేట, డొంకేశ్వర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సైతం సందర్శించి పోలింగ్ సామాగ్రి పంపిణీ తీరును పరిశీలించారు. వీరి వెంట స్థానిక అధికారులు ఉన్నారు.



కానిస్టేబుల్ ఆత్మహత్య

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 16: కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లకి వెళితే కొమిరే గ్రామానికి చెందిన శివాజీ(35) సిరిసిల్ల జిల్లా పోలీస్ బెటాలియన్లో విధులు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల క్రితం లీవ్ మీద ఇంటికి వచ్చాడు. ఏదో మానసికంగా కుంగి పోయిన శివాజీ తన వ్యవసాయ పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు . కుటుంబ సభ్యులు సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలించిన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. శివాజీ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.





ఫలితాన్ని తారు మారు చేసిన 'డబుల్ ఓటు'

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 16: కొత్తపల్లి రూరల్ మండలం కమాన్ పూర్ గ్రామంలో ఒక ఓటర్ పేరు రెండు వార్డ్ లలో నమోదయి ఉండటంతో సదరు ఓటరు రెండు ఓట్లు వేయడంతో ఆరో వార్డు అభ్యర్థి ఒక ఓటుతో ఓటమి చవి చూడవలసి వచ్చింది.వివరాల్లోకి వెళితే కమాన్ పూర్ గ్రామంలో దండుగల కృష్ణ అనే వ్యక్తికి సీరియల్ నెంబర్ 1132 తో 5 వ వార్డ్ లో ఓటరు గా నమోదై ఉన్నాడని అదేవిధంగా 1605 వ సీరియల్ నంబర్ తో ఆరవ వార్డులో ఓటర్గా నమోదు ఉన్నాడని అంతేకాక ఆరో వార్డులో ఒకానొక సర్పంచ్ అభ్యర్థికి పోలింగ్ ఏజెంట్గా కూడా ఉన్నాడని అయితే సదరు ఓటరు ఐదో వార్డులో ఓటు వేయడమే కాకుండా ఆరో వార్డులో కూడా రెండో ఓటు వేశారని ఈ అక్రమ ఓటు వలన తాను ఒక్క ఓటు తేడాతో ఓడిపోయినానని కమాన్పూర్ గ్రామంలో ఆరవ వార్డ్ లో ఓడిపోయిన అభ్యర్థి కరీంనగర్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ముఖ్య ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఓటర్ నమోదు మరియు ఓటర్ లిస్ట్ వెరిఫై చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారితోపాటు రెండు ఓట్లు వేసిన ఓటర్పై విచారణ జరిపి కేసు నమోదు చేయాలని వారు కోరారు. దాంతోపాటు ఆరో వార్డుకు మళ్ళీ ఎన్నిక నిర్వహించి న్యాయం జరిపించాలని సదర్ అభ్యర్థి కోరారు.

కరీంనగర్ లో 'పునుగు పిల్లి' ప్రత్యక్షం

- క్షేమంగా పట్టుకుని డీర్‌పార్క్‌కు తరలింపు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 16: తిరుమల శేషాచలం కొండల్లో ఎక్కువగా కనిపించే అరుదైన పునుగు పిల్లి కరీంనగర్ పట్టణంలో ప్రత్యక్షమైంది. హిందూపురి కాలనీలోని నారెడ్డి రంగారెడ్డి ఇంట్లో ఈ పునుగు పిల్లి కనిపించడంతో, కుటుంబ సభ్యులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని పునుగు పిల్లిని క్షేమంగా పట్టుకున్నారు. అనంతరం దానిని స్థానిక డీర్‌పార్క్‌కు తరలించారు. పునుగు పిల్లి అనారోగ్యంతో బాధపడుతోందని, డీర్‌పార్క్‌లో దానికి వైద్యం చేయిస్తామని ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి నర్సింగరావు తెలిపారు. అది పూర్తిగా కోలుకున్న తర్వాత తిరిగి అటవీ ప్రాంతంలో వదలిపెడతామని చెప్పారు. పునుగు పిల్లి ప్రత్యేకత పునుగుపిల్లి అనేది పిల్లి జాతికి చెందినదిగా కనిపించినా, ఇది వివెరా కుటుంబానికి చెందిన అరుదైన క్షీరదం. రాత్రిపూట సంచరించే ఈ జీవులు దట్టమైన అడవుల్లో నివసిస్తాయి. దీని శరీరం



నుంచి వెలువడే 'పునుగు తైలం'ను సుగంధ ద్రవ్యాల తయారీలో, ముఖ్యంగా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి అభిషేక సేవలో పవిత్రంగా వినియోగిస్తారు. అంతేకాకుండా, ఈ పిల్లి విసర్జన నుంచి సేకరించిన గింజలతో తయారుచేసే 'కోపి లువాక్' కాఫీ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనదిగా ప్రసిద్ధి చెందింది. సాధారణంగా అడవుల్లో ఉండే ఈ జీవులు ఇటీవల తరచుగా కరీంనగర్ వంటి పట్టణ ప్రాంతాల్లో కనిపించడం గమనార్హం.

ఫర్టిలైజర్ యాప్‌పై అవగాహన కల్పించాలి


- ఆయిల్ పామ్ పంట పై రైతులకు వివరించాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రతిపక్షం, రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 16: రైతులకు ఎరువుల సరఫరా విషయంలో ఇబ్బందులు దూరం చేసేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ రూపొందించిన ఫెర్టిలైజర్ యాప్ పై అవగాహన కల్పించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లాలోని ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ



వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన యాప్ పై జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో ఈ నెల 19 వ తేదీన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ఈ యాప్ ఉన్న ఉపయోగాలను రైతులకు వివరించాలని పేర్కొన్నారు. యాప్ తో రైతులకు ఎరువుల వివరాలు, ఎక్కడ అందుబాటులో ఉందో అనే సమాచారం తెలుస్తుందని, వారికి కేటాయించిన ఎరువులు అందుబాటులో ఉంటాయనే వివరాలు తెలుపాలని సూచించారు. ఎక్కడి నుంచి అయినా రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం వివరాలతో లాగిన్ అయితే వారికి పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణ పెరగడం వల్ల రైతులకు అధిక లాభం జరగడంతో పాటు దేశానికి కూడా ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. ఆయిల్ పామ్ పంట విస్తరణ కోసం ప్రభుత్వం అనేక సబ్సిడీలను అందిస్తుందన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తిగా ఉన్న రైతుల రిజిస్ట్రేషన్, పరిపాలన మంజూరు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని నర్మెట్ట గ్రామంలో ఉందని, జిల్లాకు సమీపంలోనే ఉందని, పంట ఉత్పత్తుల విక్రయానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు.

“



రాజకీయాల ముసుగులో నేరాలు చేసే రాజకీయ రౌడీలు తయారయ్యారు. నాకూ కొన్ని గుణపాఠాలున్నాయి. నమ్మి మోసపోయా. 2019లో వైఎస్ వివేకా గుండెపోటుతో చనిపోయారని ఉదయం చెప్పారు. తర్వాతి రోజు నారాసుర రక్తచరిత్ర అని నా చేతిలో కత్తిపెట్టి పేపర్లో వేశారు. నేరస్థులు తప్పించుకుని సీఎంపైనే నేరం వేయాలని చూశారు. జనం నమ్మి వారికి ఓటేశారు. నేను ఓడిపోయా. దోషుల్ని అప్పుడే అరెస్టు చేసుంటే గెలిచేవాడిని.

- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు.



కారు నడుపుతున్న జోర్డాన్‌ప్రిన్స్.. పక్కన మోడీ

జోర్డాన్, డిసెంబర్ 16: ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మూడు దేశాల పర్యటన సోమవారం మొదలైన విషయం తెలిసిందే. ఈ పర్యటనలో భాగంగా ఆయన ముందుగా జోర్డాన్ ను సందర్శించారు. సోమవారం సాయంత్రం అమ్మాన్ కు చేరుకున్నారు. అమ్మాన్ విమానాశ్రయంలో జోర్డాన్ ప్రధాని జాఫర్ హసన్ స్వయంగా ప్రధాని మోడీకి స్వాగతం పలికి ప్రత్యేక గౌరవం కల్పించారు. తన పర్యటనలో భాగంగా మంగళవారం ప్రధాని మోడీ జోర్డాన్ మ్యూజియాన్ని సందర్శించారు. ఆ దేశ యువరాజు అల్ హుస్సేన్ బిన్ అబ్దుల్లా2 స్వయంగా కారు నడుపుతూ మోడీని మ్యూజియానికి తీసుకెళ్లడం విశేషం. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఈ మ్యూజియం అమ్మాన్‌లోని రాస్ అల్ ఐన్ జిల్లాలో ఉంది. ఇది ఆ దేశంలోనే అతిపెద్ద మ్యూజియం. ఈ మ్యూజియంలో అత్యంత ముఖ్యమైన పురావస్తు, చారిత్రక కళాఖండాలను ప్రదర్శిస్తారు. ఇందులో 1.5 మిలియన్ సంవత్సరాల నాటి జంతువుల ఎముకలు, 9 వేల సంవత్సరాల నాటి ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన విగ్రహాలు ఉంటాయి. జోర్డాన్ పర్యటనకు వెళ్లే టూరిస్టులు ఈ మ్యూజియాన్ని తప్పకుండా సందర్శిస్తుంటారు.

విశ్వ వీక్షణం



సంపన్నుల నగరం

ఈ నగరంలో ప్రతి 24 మందిలో ఒకరు కోటీశ్వరుడు. అంతేకాదు, ఈ సంఖ్య ఏటా పెరుగుతోంది. భారతదేశంలో అత్యంత ధనవంతుడైన వ్యక్తి ఎవరో మీకు తెలిసిందే, ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన వ్యక్తి పేరు కూడా మీరు వినే ఉంటారు. కానీ ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల నగరం ఏదో మీకు తెలుసా? ఈ ధనవంతుల నగరంలో చాలా మంది సాధారణ ప్రజల కంటే ఎక్కువ ధనవంతులుగా పరిగణించబడుతున్నారు. ఇక్కడ ప్రతి 24 మందిలో ఒకరు కోటీశ్వరుడు. అంతేకాదు, ఈ సంఖ్య ఏటా పెరుగుతోంది. మీ ఊహ సరైనదే, ఈ స్వప్న నగరం న్యూయార్క్ తప్ప మరొకటి కాదు. హెన్లీ & పార్టనర్స్ విడుదల చేసిన ధనవంతుల నగరాల జాబితా ప్రకారం న్యూయార్క్‌లో దాదాపు 349,500 మంది కోటీశ్వరులు నివసిస్తున్నారు. 2012 మరియు 2022 మధ్య కరోనా మహమ్మారి కారణంగా కొంతమంది ధనవంతులు నగరం నుండి వెళ్లిపోయినప్పటికీ, ఇక్కడ నివసిస్తున్న ధనవంతుల సంఖ్య 40% పెరిగిందని నివేదిక పేర్కొంది. న్యూయార్క్ జనాభా దాదాపు 82 లక్షలు. 744 మంది వ్యక్తుల వద్ద 100 మిలియన్ డాలర్లకు పైగా ఆస్తులు ఉన్నాయని నివేదిక పేర్కొంది. హెన్లీ & పార్టనర్స్ ప్రపంచంలోని 10 అత్యంత ధనవంతుల నగరాల జాబితాను విడుదల చేసింది. హెన్లీ & పార్టనర్స్ అత్యంత సంపన్నమైన, గొప్ప వారసత్వం, భౌగోళిక స్థానం, పరిశ్రమలు, ప్రపంచ స్థాయిలో ప్రభావాన్ని చూపే స్థానిక అభివృద్ధి మరియు ఇక్కడ నివసిస్తున్న కోటీశ్వరుల సంఖ్య ఆధారంగా నగరాలను అంచనా వేసింది. ఈ విషయంలో న్యూయార్క్ మొదటి స్థానంలో ఉంది.

ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల నగరాల జాబితాలో అమెరికా ఆర్థిక కేంద్రం మొదటి స్థానంలో ఉండగా, మాన్‌హట్టన్‌లోని ఫిఫ్త్ అవెన్యూలో నివాస అపార్ట్‌మెంట్ల ధరలు అత్యధికంగా ఉన్నాయి. న్యూయార్క్ నగరం ప్రపంచంలోనే అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజీలు నాస్డాక్ మరియు NYSEకి కూడా నిలయం. ఉత్తర కాలిఫోర్నియా, టోక్యో, సింగపూర్, లండన్, లాస్ ఏంజిల్స్, పారిస్, సిడ్నీ, హాంగ్ కాంగ్ మరియు చివరగా బీజింగ్, న్యూయార్క్ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.



థాయ్‌లాండ్ ట్రిప్‌లో ఈ రిస్క్ వద్దు

మీరు థాయ్‌లాండ్ కి ట్రిప్ ప్లాన్ చేస్తున్నారా? అయితే తప్పకుండా ఆ దేశంలోని కఠినమైన కస్టమ్స్ నిబంధనల గురించి తెలుసుకోండి. లేదంటే భారీ జరిమానాలతో సహా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి రావచ్చు. థాయ్ లాండ్ అనగానే ముందుగా గుర్తుకువచ్చేది మసాజ్. అంటే అసాంఘిక కార్యకలాపాలు జరుగుతాయని చాలామంది భావిస్తుంటారు. కాబట్టి అశ్లీలతకు సంబంధించిన సామాగ్రిని ఆ దేశానికి ఈజీగా తీసుకెళ్ళవచ్చని అనుకుంటారు. ఇలా చేస్తే మీరు చిక్కుల్లో ఇరుకున్నట్లే. ఎట్టి పరిస్థితుల్లో అశ్లీల సామాగ్రిని థాయ్‌లోకి అనుమతించరు... వాటిపై అక్కడ నిషేదం వుంది. ఇక పుస్తకాలపై కూడా థాయ్‌లాండ్‌లో నిషేధం వుంది మ్యాగజైన్ అయినా లేదా అనుమానాస్పద వీడియో అయినా అక్కడికి అనుమతించబడదు. ఈ వస్తువులను





తీసుకురావడం వల్ల జరిమానాలు, జైలు శిక్ష లేదా దేశ బహిష్కరణకు దారితీయవచ్చు. థాయ్ జెండాను అగౌరవపర్చడమే కాదు ఆ దేశ గౌరవానికి భంగం కలిగించేలా ఏదైనా వస్తువును తీసుకువెళ్లడం చట్టవిరుద్ధం. అలా చేస్తే వస్తువులను స్వాధీనం చేసుకోవడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. జాతీయ చిహ్నాలు, సాంస్కృతిక గౌరవాన్ని కాపాడడంలో థాయ్ అధికారులు కఠినంగా ఉంటారు.

గంజాయి, నల్లమందు, కొకైన్, మార్ఫిన్, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలు థాయ్ లాండ్ లో నిషేధించబడ్డాయి. వైద్యపరంగా సూచించినప్పటికీ థాయ్‌లాండ్ వాటి దిగుమతి లేదా ఎగుమతిని నిషేధించింది. ఉల్లంఘనలు జైలు శిక్షతో సహా తీవ్రమైన చట్టపరమైన పరిణామాలకు దారితీయవచ్చు.

నకిలీ కరెన్సీ, సెక్యూరిటీలు లేదా నాణేలు థాయ్‌లాండ్‌లో అనుమతించబడవు. నకిలీ నోట్ల అక్రమ రవాణా భారీ జరిమానాలు లేదా జైలు శిక్షకు దారితీయవచ్చు. ఆర్థిక మోసాల విషయంలో ఈ దేశం చాలా తీవ్రంగా ఉంటుంది, కాబట్టి నిజమైన కరెన్సీని మాత్రమే తీసుకెళ్లండి.

మ్యూజిక్ ఫైల్‌లు, CDలు, వీడియోలు లేదా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ వంటి మేధో సంపత్తి హక్కులను ఉల్లంఘించే వస్తువులను థాయ్‌లాండ్‌లో అనుమతించబడదు. థాయ్ అధికారులు కాపీరైట్‌ల విషయంలో థాయ్ కఠినంగా వుంటుంది... కాబట్టి ఉల్లంఘనలు జరిమానాలు లేదా జైలు శిక్షకు దారితీయవచ్చు.

నకిలీ బ్రాండెడ్ వస్తువులను తీసుకురావడానికి లేదా బయటకు తీసుకెళ్లడానికి ప్రయత్నించడం వల్ల థాయ్‌లాండ్‌లో తీవ్ర పరిణామాలు ఉంటాయి. అది గాడ్జెట్ అయినా లేదా మరేదైనా వస్తువు అయినా, నకిలీలకు చోటు లేదు.

నిషేధిత వస్తువులు

కొన్ని వస్తువులను థాయ్‌లాండ్‌లోకి తీసుకురావడానికి ప్రభుత్వ విభాగాల నుండి ప్రత్యేక అనుమతి అవసరం. తుపాకులు, వాటి భాగాలు, మందుగుండు సామగ్రికి జాతీయ పోలీస్ కార్యాలయం నుండి ఆమోదం అవసరం. బుద్ధ విగ్రహాలు, కళాఖండాలు, పురాతన వస్తువులకు లలిత కళల విభాగం నుండి అనుమతి అవసరం. రేడియో ట్రాన్స్‌సీవర్లు, టెలికమ్యూనికేషన్ పరికరాలకు పోస్ట్ మరియు టెలిగ్రాఫ్ విభాగం నుండి ఆమోదం అవసరం. మొక్కలతో పాటు వ్యవసాయ సామగ్రికి వ్యవసాయ శాఖ నుండి అధికారం అవసరం. జీవాలకు సంబంధించి పశుసంవర్ధక శాఖ నియంత్రణలోకి వస్తాయి.చివరగా మందులు, రసాయనాలకు ఆహార మరియు ఔషధ పరిపాలన నుండి అనుమతి అవసరం.





'స్టాట్యూ ఆఫ్ లిబర్టీ' కూలింది

- బలమైన గాలులతో నేలకూలిన భారీ విగ్రహం

బ్రెజిల్, డిసెంబర్ 16: బ్రెజిల్‌ని బలమైన తుఫాను అతలాకుతలం చేసింది. బలమైన గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దక్షిణ బ్రెజిల్‌లోని రియో గ్రాండే డో సుల్ రాష్ట్రంలో గాలుల తీవ్రత అధికంగా ఉంది. ఈ గాలుల తీవ్రతకు మెట్రోపాలిటన్ ప్రాంతంలోని పోర్టో అలెగ్రే సమీపంలో గల గువైబా నగరంలో ఉన్న స్టాట్యూ అఫ్ లిబర్టీ విగ్రహం ఒక్కసారిగా నేలకూలిపోయింది. దాదాపు 24 మీటర్ల పొడవున్న ఈ విగ్రహం హవాన్ రిటైల్ దుకాణంలోని పార్కింగ్ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. అయితే, బలమైన గాలులకు అది ఒక్కసారిగా కూలి పార్కింగ్ ప్లేస్‌లో పడిపోయింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో అక్కడ ప్రజలు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విగ్రహం కూలుతున్న దృష్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇక తుఫాన్ సమయంలో గాలి వేగం గంటకు 90 కిలోమీటర్లకు మించి నమోదైనట్లు స్థానిక మీడియా పేర్కొంది. మెట్రోపాలిటన్ ప్రాంతమంతా తీవ్రమైన వాతావరణ హెచ్చరికలు జారీ అయ్యాయి.



జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఉన్నత విద్యా కమిషన్ బిల్లు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 16: ఉన్నత విద్యా సంస్థలను నియంత్రించడానికి 13 మంది సభ్యుల వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ఉద్దేశించిన బిల్లును సంయుక్త పార్లమెంటరీ సంఘానికి (జేపీసీ) నివేదిస్తూ లోక్‌సభ మంగళవారం ఓ తీర్మానాన్ని ఆమోదించింది. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ ప్రతిపాదనను ప్రవేశపెట్టగా మూజువాణి ఓటుతో సభ దీన్ని ఆమోదించింది. లోక్‌సభలో సోమవారం ఈ బిల్లును ప్రవేశపెట్టిన ప్రధాన్ వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లును పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త కమిటీకి పంపాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ప్రవేశపెట్టిన తీర్మానం ప్రకారం జేపీసీలో లోక్‌సభ నుంచి 21 మంది సభ్యులు, రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులు ఉంటారు.

మెస్సీ పర్యటన గందరగోళం..

స్పోర్ట్స్ మినిస్టర్ రాజీనామా ఆమోదం


ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, కోల్‌కత, డిసెంబర్ 16: అర్జెంటీనా ఫుట్ బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ పర్యటన సందర్భంగా గత ఆదివారం పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియం లో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఆ ఉద్రిక్తతలకు బాధ్యత వహిస్తూ బెంగాల్ స్పోర్ట్స్ మినిస్టర్ అరూప్ బిశ్వాస్ తన పదవికి రాజానామా చేయగా.. ఆ రాజీనామాకు సీఎం మమత బెనర్జీ ఆమోదముద్ర వేశారు. సాల్ట్ లేక్ స్టేడియానికి వచ్చిన మెస్సీని చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో ఎగబడ్డారు. అయితే సరైన ఏర్పాట్లు లేకపోవడంతో వారిని లోపలికి పంపడంలో ఆలస్యం జరిగింది. మెస్సీ కార్యక్రమం ముగించుకుని వెళ్లేసరికి ఇంకా సగం మంది స్టేడియం బయటే ఉన్నారు. దాంతో తమ దగ్గర డబ్బులు వసూలు చేసి స్టేడియంలోపలికి ఎందుకు అనుమతించలేదని అభిమానులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈవెంట్ నిర్వాహకుల తీరును నిరసిస్తూ ఆందోళనకు దిగారు. స్టేడియంలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఈ ఘటన రాజీకీయంగా కూడా తీవ్ర దుమారం రేపింది. మెస్సీ పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయించడంలో బెంగాల్ ప్రభుత్వం విఫలమైందని ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఈ నేపథ్యంలో బెంగాల్ క్రీడా శాఖ మంత్రి అరూప్ బిశ్వాస్ తన పదవికి రాజీనామా చేశారు. వెంటనే ఆ రాజీనామాకు సీఎం మమతా బెనర్జి ఆమోదముద్ర వేశారు.



ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన 34 మంది మావోయిస్టులు

ప్రతిపక్షం, కొత్తగూడెం, డిసెంబర్ 16: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పోలీసు అధికారుల ఎదుట 34 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వివరాలను బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ మీడియాకు వెల్లడించారు. లొంగిపోయిన వారిలో 26 మందిపై రూ.84 లక్షల రివార్డులు ఉన్నాయని, ఇందులో ఏడుగురు మహిళలు కూడా ఉన్నారని తెలిపారు.ఈ 26 మందిపై రూ.లక్ష నుంచి రూ.8 లక్షల రివార్డు ఉన్నవారు ఉన్నట్లు వెల్లడించారు. వీరిలో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ, తెలంగాణ రాష్ట్ర కమిటీ, ఆంధ్రాఒడిశా బోర్డర్ డివిజన్ సభ్యులు ఉన్నారని పేర్కొన్నారు. లొంగిపోయిన వారికి తక్షణ సహాయార్థం రూ.50 వేల ప్రోత్సాహకాన్ని అందించనున్నట్లు తెలిపారు.





మినీ వేలంలో.. మన కుర్రాళ్ల హవా

ఐపీఎల్ 2026 కోసం అబుదాబీలో నిర్వహించిన మినీ వేలంలో యువక్రికెటర్లు ఊహించని ధర పలికారు. ఆరంభంలోనే కామెరూన్ గ్రీన్ (రూ.25.20 కోట్లు), మథీశ పథిరన (రూ. 18కోట్లు)లు రికార్డు ధరకు అమ్ముడవ్వగా.. ఆ తర్వాత భారత కుర్రాళ్ల ప్రభంజనం కొనసాగింది. దేశవాళీలో అత్యుత్తమ ప్రదర్శనతో ఫ్రాంచైజీలను ఫిదా చేసిన ప్రశాంత్ వీర్, కార్తిక్ శర్మ అత్యధిక ధర పలికిన అన్‌క్యాప్డ్ ప్లేయర్లుగా అవతరించారు. ఆఖర్లో లియాం లివింగ్‌స్టోన్‌ను రూ.13 కోట్లకు కొనేసింది ఆరెంజ్ ఆర్మీ. దాంతో.. అతడు టాప్ 5లో చోటు సంపాదించాడు. అంచనాలను తలకిందులు చేస్తూ అనామకులకు పట్టంకట్టిన ఐపీఎల్ వేలం ఆద్యంతం ఆసక్తి రేపింది. చేతినిండా డబ్బులతో కోల్‌కతా నైట్ రైడర్స్ స్టార్ ప్లేయర్లు కామెరూన్ గ్రీన్, మతీశ పథిరనలను పట్టేసింది. దాంతో.. ఆరంభ సీజన్ నుంచి కొనసాగిన విదేశీ క్రికెటర్ల హవా ఈసారి కనిపించింది. అయితే.. ఆ తర్వాత నుంచి భారత యువకెరటాలు భారీ ధరతో వైరలయ్యారు. నిండా పాతికేళ్లులేని కుర్రాళ్లు అందర్నీ ఆశ్చర్యపరుస్తూ అబుధాబీలో హాట్‌కేకుల్లా అమ్ముడయ్యారు. రూ.30 లక్షల కనీస ధరతో యాక్షన్‌కు వచ్చిన ప్రశాంత్ వీర్, కార్తిక్ శర్మలు ఏకంగా రూ.14.2 కోట్లు కొల్లగొట్టారు. మధ్యప్రదేశ్ పేసర్ మంగేశ్ యాదవ్ ఏకంగా రూ.5.2కోట్లకు అమ్ముడయ్యాడు.




ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu



అభిగ్యాన్ డబుల్ సెంచరీ... అండర్ 19 టీమిండియా భారీ విజయం

అండర్ 19 ఆసియా కప్‌లో భారత కుర్రాడు అభిగ్యాన్ కుందు (209) డబుల్ సెంచరీతో చెలరేగాడు. మంగళవారం మలేషియా బౌలర్లను ఊచకోత కోస్తూ 9 సిక్సర్లతో రెచ్చిపోయి జట్టుకు భారీ స్కోర్ అందించాడు. వేదాంత్ త్రివేది(90) మెరుపులు తోడవ్వడంతో నాలుగొందలు కొట్టిన యువ భారత్... అనంతరం ప్రత్యర్థిని 93కే ఆలౌట్ చేసి.. 315 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. హ్యాట్రిక్ విజయాలతో అయుష్ మాత్రే సేన గ్రూప్ ఏలో అగ్రస్థానంతో సూపర్ 8కు చేరువైంది. అండర్ 19 ఆసియా కప్‌లో భారత జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. ఇప్పటికే యూఏఈ, పాకిస్థాన్‌ను చిత్తు చేసిన టీమిండియా మూడో మ్యాచ్‌లో మలేషాయాను వణికించింది. దుబాయ్‌లోని సెవెన్స్ అకాడమీలో మంగళవారం కుర్రాళ్లు చితక్కొట్టగా 7 వికెట్ల నష్టానికి 408 పరుగులు చేసింది టీమిండియా. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(50) అర్ధ శతకంతో శుభారంభమివ్వగా.. కెప్టెన్ అయుష్ మాత్రే(14), విహాన్ మల్హోత్ర(7)లు విఫలమయ్యారు. 87 పరుగులకే మూడు వికెట్లు పడిన వేళ భారత్ రెండొదలకు పైగా చేస్తుందనిపించింది. కానీ, మలేషియా బౌలర్లపై విరుచుకుపడిన అభిగ్యాన్ కుందు(209 125 బంతుల్లో 17 ఫోర్లు, 9 సిక్సర్లు) డబుల్ సెంచరీతో, వేదాంత్ త్రివేది(90) అర్ధ శతకంతో కదంతొక్కగా కొండంత స్కోర్ కొట్టిన యువ భారత్.. ఆ తర్వాత బౌలర్ల విజృంభణతో ప్రత్యర్థిని 93కే ఆలౌట్ చేసింది. పాకిస్థాన్‌పై మూడు వికెట్లతో చెరేగిన దీపేశ్ దేవేంద్రన్ 5 వికెట్లతో మలేషియా నడ్డివిరిచాడు. ఉద్దవ్ మోహన్ రెండు వికెట్లతో రాణించాడు.



నేడు ఛాంపియన్ ట్రైలర్ లాంచ్

చీఫ్ గెస్ట్ గా రామ్ చరణ్

ఫ్రెష్, ఆకట్టుకునే కథలను అందించడంలో స్వప్న సినిమాస్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుంది. వారి అప్ కమింగ్ వెంచర్ ఛాంపియన్ ఆసక్తికరమైన ప్రమోషనల్ కంటెంట్ తో ఇప్పటికే బజ్ క్రియేట్ చేసింది. జీ స్టూడియోస్ సమర్పణ లో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్‌తో కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఈ చిత్రంలో రోషన్, అనస్వర రాజన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. నందమూరి కళ్యాణ్ చక్రవర్తి, అర్చన కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే విడుదలైన గిరిగిర, సల్లంగుండాలే పాటలు చార్ట్ బస్టర్ అయ్యాయి. తాజాగా మేకర్స్ ట్రైలర్ అప్డేట్ ఇచ్చారు. డిసెంబర్ 18న ట్రైలర్ రిలీజ్ కానుంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ కి మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ చీఫ్ గెస్ట్ గా విచ్చేసి ట్రైలర్ లాంచ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ రిలీజ్ చేసిన 'చిరుత ఫర్ ఛాంపియన్' స్పెషల్ వీడియోలో చిరుతోస్తే చిందే వేయ్యాలా సాంగ్ అభిమానులని అలరించింది. ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ అద్భుతమైన అల్బమ్ కంపోజ్ చేశారు. తోట తరణి ప్రీఇండిపెండెన్స్ కాలాన్ని అద్భుతమైన డీటెయిల్స్‌తో రిక్రియేట్ చేశారు, ఆర్. మధీ కెమెరా వర్క్ ఆ ప్రపంచంలోకి మనల్ని లీనం చేస్తుంది. ఈ చిత్రానికి ఎడిటింగ్ బాధ్యతలను లెజెండరీ కోటగిరి వెంకటేశ్వరరావు నిర్వహిస్తున్నారు.

అఖండ 2 తాండవం విజయం గౌరవాన్ని తీసుకొచ్చింది

– బోయపాటి శ్రీను

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను అఖండ భారత్ బ్లాక్ బస్టర్ 'అఖండ 2: ది తాండవం'. ఈ ప్రతిష్ఠాత్మకమైన చిత్రాన్ని 14 రీల్స్ ప్లస్ బ్యానర్ పై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించారు. ఎం తేజస్విని నందమూరి సమర్పించారు. డిసెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ తో హౌస్ ఫుల్ కలెక్షన్స్ తో రన్ అవుతోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ బోయపాటి శ్రీను విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

ఈ అఖండ విజయాన్ని ఎలా ఆస్వాదిస్తున్నారు?
ఈ అఖండ విజయాన్ని ఎంత ఫీలైనా తక్కువే. ఇంకా కావాలని కోరుకుంటున్నాను. ఈ సినిమా డబ్బు కోసం తీసింది కాదు. ఈ సినిమా ప్రజలకు చేరాలని తీశాం. మన తత్వం ఏమిటి? ప్రపంచంలో ఎవరైనా మనల్ని చూసి చేతులెత్తి దండం పెడతారు ఎందుకు? మనం ఆచరించే ధర్మం కోసం. మనం బిడ్డ పుట్టగానే పేగు తెంచి దేవుడికి ముడి వేస్తాం. దేవుడు పేరు పెట్టుకుంటాం. ఎదుగుతుంటే దేవుడు దయ అంటారు. చివరికి లోకాన్ని విడిచినప్పుడు కూడా దేవుడి దగ్గరికి వెళ్ళాడు అంటాం. మనకి కష్టం వచ్చినా దేవుడే ఆనందం వచ్చిన దేవుడే. అలాంటి అంశాలతో ఒక గొప్ప దారిని ఎంచుకుని తీసిన సినిమా ఇది. ఇది ప్రతి ఒక్కరికి చేరాల్సిన సినిమా. ఇది తప్పకుండా అందరికీ రీచ్ అవుతుంది.

ఈ సినిమా రిలీజ్ ఒక వారం రోజులు ఆలస్యమైంది కదా.. ఆ సమయంలో మీ ఆలోచనలు ఎలా ఉన్నాయి? బాలయ్య ఎలాంటి సపోర్ట్ ఇచ్చారు?
నేను మనిషినే. నాకు ఫీలింగ్స్ ఉంటాయి. కొన్ని అనివార్య కారణాలవల్ల అలాంటి ఒక పరిస్థితి వచ్చింది. అయితే మా ఆలోచన అంతా బాలకృష్ణ గారి అభిమానుల గురించే. రెండు రోజులు ముందు చెప్తే అర్థం చేసుకుంటారు. కానీ ఒక రెండు గంటలకు ముందు టికెట్లు తీసుకుని థియేటర్స్ దగ్గరకు వెళ్లిన తర్వాత ఇలా వాయిదా అని చెప్తే ఎవరికైనా కోపం వస్తుంది. అది సహజం. ఆ క్షణం మా ఆలోచనలన్నీ అభిమానుల గురించే. అయితే వచ్చిన పరిస్థితి గురించి మేము భయపడలేదు. మాకు బాలకృష్ణ గారు ఉన్నారనే ధైర్యం ఉంది. ఆయన మాకు ఇచ్చిన సపోర్టు మర్చిపోలేము. అలాంటి పరిస్థితి వచ్చిన తర్వాత బాలయ్య సినిమా విడుదలకి ఏం కావాలో అన్నీ చేశారు.

మీరు థియేటర్స్ విజిట్ కి వెళ్ళినప్పుడు ఆ రెస్పాన్స్ మీకు ఎలాంటి అనుభూతిని ఇచ్చింది?
ఆ ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. ఒక మంచి సినిమా తీసి ఆశించాల్సిందే డబ్బు కాదు గౌరవం. అలాంటి గౌరవం వచ్చింది. సహజంగా థియేటర్స్ విజిట్ కి వెళ్ళినప్పుడు అందరూ నిలబడి విజిల్స్, క్లాప్స్ కొడతారు. కానీ ఈ సినిమాకి వెళ్ళినప్పుడు అందరూ లేచి చేతులెత్తి దండం పెట్టారు. నేను కూడా 'మీ అందరి స్పందన చూడడానికే వచ్చానని' అందరికీ నమస్కరించి వచ్చాను. నిజంగా ఇది చాలా గొప్ప అనుభూతి.



ఈ సినిమాతో మీరు ఒక కొత్త ఏరియాలోకి ఎంటర్ అయినట్టుగా అనిపించింది?
కొత్త పాత అని కాదు గాని..ఇదంతా మనలో మమేకమై ఉన్నది. మన ధర్మం మన తల్లి లాంటిది. మన తల్లి గురించి అద్భుతంగా చెప్పాము. మన ధర్మాన్ని మనం ఫాలో అయితే అద్భుతంగా ఉంటామని చెప్పాము. థియేటర్స్‌లో చిన్న పిల్లలు ఎక్కువమంది ఉన్నారు. వాళ్ళకేరింతలు చూస్తుంటే చాలా ఆనందంగా అనిపించింది.

దేశభక్తి దైవభక్తి ఈ రెండు కలగలిపిన సినిమాలు లేవు.. ఈ ఆలోచన ఎలా తట్టింది?
అఖండ చూసి జనాల అంచనాలు భారీగా పెరిగాయి. తర్వాత వచ్చే సినిమా ఇంకా గొప్ప స్థాయిలో ఉండాలి అనుకున్నాము. అలాగే మన ధర్మాన్ని చెప్పడం కూడా ఒక గొప్ప విషయం. ప్రకృతి పసిబిడ్డ పరమాత్మ తర్వాత దేశం ధర్మం దైవమే నాకు కనిపించింది. అలాంటి కథతో వస్తేనే అభిమానుల అంచనాలను అందుకోగలం. అందుకే ఆ అంశాన్ని టచ్ చేయడం జరిగింది.

ఇందులో అఘోర పాత్ర మాట్లాడినప్పుడు వాయిస్ కల్చర్ చాలా డిఫరెంట్ గా ఉంటుంది కదా.. దాని కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?
సినిమా అంటే ఒక యజ్ఞం. ప్రతిదీ చాలా కేర్ తీసుకుంటూ చేయాలి. ప్రతి డీటెయిల్ నా స్క్రిప్ట్ లో ఉంటుంది. పార్ట్ వన్ లో అఘోర క్యారెక్టర్ మనందరికీ సుపరిచితం. 12 సంవత్సరాలు తర్వాత ఒక సాధనలో ఉన్న వ్యక్తి బయటకు వస్తే ఎలా మాట్లాడుతాడు? అలాంటి వేరియేషన్స్ వేసుకుని డబ్బింగ్ రూంలో బాలయ్య గారితో ప్రతిదీ వివరంగా చర్చించుకుని ప్రతి క్యారెక్టర్ ఎలా మాట్లాడాలి? దాన్ని తత్వం ఏమిటి అనేది జాగ్రత్తగా ప్రతిదీ చాలా కేర్ తో చేయడం జరిగింది.

నార్త్ లో రెస్పాన్స్ ఎలా ఉంది?
కర్ణాటక, చెన్నై, హిందీలో సినిమా ఉగ్రూతలూగుతుంది. మారుమూల గ్రామాల్లో కూడా సినిమా ఆడుతోంది. అద్భుతమైన రెస్పాన్స్ ఉంది. రెవిన్యూ పరంగా చాలా స్ట్రాంగ్ గా ఉన్నాం. ఈ సినిమా భారత దేశ ఆత్మలాంటిది. అందరికీ చేరాలని ఉద్దేశంతో తీసిన సినిమా. 135 రోజుల్లో సినిమా తీశాను. కొబ్బరికాయ కొట్టిన రోజే డేట్ అనౌన్స్ చేస్తామని బాలకృష్ణ గారికి ముందే చెప్పాను. సెప్టెంబర్ 25 సినిమా రిలీజ్ అన్నాం. మేము అనుకున్నట్టే కాపీ రెడీ అయిపోయింది. అదే సమయానికి ఓజి సినిమా ఉంది. ఇండస్ట్రీలో రెండు పెద్ద సినిమాలు ఒకేసారి రావడం అంత కరెక్ట్ కాదు. రెండు సినిమాలు బాగుండొచ్చు. కానీ థియేటర్స్ షేర్ అయిపోతాయి. మన రెవిన్యూని మనమే ఇబ్బంది పెట్టుకున్నట్టుగా ఉంటుంది. అప్పుడు బాలయ్య గారు తమ్ముడికి దారి ఇచ్చేద్దాం, మనం తర్వాత వద్దామన్నారు. అలా మేము పక్కకు వచ్చాము. అఖండ2 త్రీడీలో ఇంకా అద్భుతంగా ఉంటుంది. మీరు ఈ సినిమాని త్రీడీలో పిల్లలకు చూపిస్తే మరోసారి వెళ్దామని అంటారు. అంత గ్రాండ్ ఇయర్ గా వచ్చింది.

ఈ సినిమా చూసిన తర్వాత మీరు ఒక మంచి పౌరాణికం సినిమా చేస్తే బాగుంటుందని అభిప్రాయం కలిగింది?
నాకు అలాంటి ఆలోచన ఉంది. ఈ సినిమా వరకు మాత్రం ఆ భగవంతుడే పక్కనుండి నడిపించాడు. మేము చేసిన క్లైమాక్స్ లో ఎవరూ చేయలేరు. ఇంపాజిబుల్. కొన్ని లొకేషన్ ఫోటోలు చూపిస్తే నిజంగా భయపడతారు. అయినా మేము ఎక్కడ భయపడలేదు. నాకు ప్రతి జోనర్ చేయాలని ఉంది.

నెక్స్ట్ చేయబోయే ప్రాజెక్టు గురించి?
మరో 10 రోజుల్లోనే నా నెక్స్ట్ సినిమాకు సంబంధించిన వివరాలు చెప్తాను.



వేలంలో టాప్.. కామెరూన్

ఐపీఎల్ 2026 మినీ వేలంలో అందరూ ఊహించినట్లుగానే ఆస్ట్రేలియా బ్యాటింగ్ ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ భారీ ధర పలికాడు. కనీస ధర రూ.2 కోట్లు ఉన్న అతడిని దక్కించుకోవడం కోసం తొలుత కోల్‌కతా నైట్‌రైడర్స్, రాజస్థాన్ రాయల్స్ పోటీ పడ్డాయి. తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ కూడా రేసులోకి వచ్చింది. చివరకు కేకేఆర్ గ్రీన్‌ను రూ.25.20 కోట్లకు కొనుగోలు చేసింది. ఐపీఎల్‌లో అత్యధిక ధర పలికిన విదేశీ ఆటగాడిగా గ్రీన్ రికార్డు సృష్టించాడు. అంతకుముందు 2024లో మిచెల్ స్టార్క్‌ను కేకేఆర్ రూ. 24.75 కోట్లుకు సొంతం చేసుకుంది. ఇప్పుడు ఆ రికార్డును ఈ 26 ఏళ్ల ఆస్ట్రేలియన్ ఆల్ రౌండర్ తిరగరాశాడు. ఓవరాల్‌గా ఐపీఎల్ చరిత్రలో కామెరూన్ గ్రీన్‌ది మూడో అత్యధిక ధర. రిషభ్ పంత్ (రూ.27 కోట్లు, ఎల్ఎస్‌జీ, ఐపీఎల్ 2025 వేలం), శ్రేయస్ అయ్యర్ (రూ.26.75 కోట్లు, పంజాబ్ కింగ్స్, ఐపీఎల్ 2025 వేలం) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. అయితే కామెరూన్ గ్రీన్ దక్కించుకున్న రూ. 25.20 కోట్లలో బీసీసీఐ కోత విధించనుంది. ఐపీఎల్ గత సీజన్‌లో ప్రవేశపెట్టిన కొత్త నిబంధన ప్రకారం.. విదేశీ ఆటగాళ్లు రూ.18 కోట్ల కంటే ఎక్కువ ధర పలికితే, ఆపై మిగిలిన మొత్తాన్ని బీసీసీఐ ప్లేయర్ల వెల్ఫేర్ కోసం ఖర్చు చేయనుంది. దీంతో గ్రీన్ పలికిన ధరలో 7.20 కోట్లు బీసీసీఐకి వెళ్లనున్నాయి.



కనీస ధరకు 'పృథ్వీ షా'..

రంజీలకే పరిమితమైన భారత క్రికెటర్ పృథ్వీ షా ఐపీఎల్‌లో పునరామనం చేయనున్నాడు. మంగళవారం అబుధాబీలో జరిగిన మినీ వేలంలో ఈ విధ్వంసక క్రికెటర్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ కొనేసింది. తొలి రౌండ్‌లో అతడిని వద్దనుకున్న ఢిల్లీ.. రెండో రౌండ్‌లో రూ. 75 లక్షల కనీస ధరకు మళ్లీ సొంత గూటికి చేర్చుకుంది. దాంతో.. ఇటీవల రంజీ, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో దంచేసిన షా.. మరోసారి ఐపీఎల్‌లో మెరుపు ఇన్నింగ్స్‌లతో అభిమానులను అలరించనున్నాడు. ఐపీఎల్‌లో తుఫాన్ ఇన్నింగ్స్‌లతో వైరలైన పృథ్వీ షా.. పదిహేడో సీజన్ తర్వాత అడ్రసే లేకుండా పోయాడు. ఫామ్ లేమితో ఇబ్బందిపడిన ఈ యంగ్‌స్టర్‌ను పద్దెనిమిదో సీజన్లో ఎవరూ కొనలేదు. సో.. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరదతో 19వ సీజన్‌కోసం పేరు నమోదు చేసుకున్నాడు షా. అబుధాబీలో వేలం మొదలైన కాసేపట్లోనే పృథ్వీ పేరు వచ్చినా.. ఏ జట్టు కొనేందుకు ఆసక్తి చూపించలేదు. దాంతో.. ఇక మనోడి పనైపోయిందనకున్నారు అభిమానులు. కానీ, అనూహ్యంగా రెండో దఫాలో అతడిని ఢిల్లీ క్యాపిటల్సే రూ.75 లక్షల కనీస ధరకు దక్కించుకుంది. అంతే.. 'హమ్మయ్య' అని ఊపిరిపీల్చుకున్నాడీ క్రికెటర్. అయితే.. 2025లో రూ.8 కోట్లు పలికిన ఈ ముంబై బ్యాటర్ ఈసారి ఇంత తక్కువ ధరకు ఆడాల్సి రావడం బాధాకరం.

'దండోరా' అద్భుతమైన చిత్రం

నటుడు శివాజీ

విలక్షణ నటుడు శివాజీ ప్రధాన పాత్రను పోషించిన చిత్రం 'దండోరా'. 'కలర్ ఫొటో', 'బెదురులంక 2012' వంటి మంచి చిత్రాలను నిర్మించి అందరి దృష్టిని ఆకర్షించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని 'దండోరా' మూవీని రూపొందించారు. ఈ చిత్రంలో శివాజీతో పాటుగా నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ చిత్రానికి మురళీకాంత్ దర్శకత్వం వహించారు. ఈ మూవీని డిసెంబర్ 25న భారీ ఎత్తున విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమోషన్స్‌లో భాగంగా నటుడు శివాజీ మీడియాతో ముచ్చటించారు. చిత్రం గురించి ఆయన చెప్పిన సంగతులివే..

'కోర్ట్' కంటే ముందే 'దండోరా' కథ విన్నారా?
ముందుగా 'దండోరా' కథను విన్నాను. ఇందులో నా పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ముందే 'దండోరా' మేకర్లు అడ్వాన్స్ ఇచ్చారు. కానీ ప్రొడక్షన్ పరంగా ఆలస్యమైంది. అలా 'కోర్ట్' ముందుగా రిలీజ్ అయింది.

'దండోరా'లో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?
'దండోరా' చిత్రంలో నా పాత్ర డిఫరెంట్‌గా ఉంటుంది. మంచోడా? చెడ్డోడా? అని చూసే ప్రేక్షకుడికి సరిగ్గా అర్థం కాదు. సినిమా చూసిన తరువాత ఆడియెన్స్ నా పాత్ర గురించి చెప్పాల్సి ఉంటుంది. ఈ చిత్రంలో నేను వ్యవసాయదారుడిగా కనిపిస్తాను. అయితే ఈ చిత్రంలోని అన్ని కారెక్టర్స్ నా చుట్టూనే తిరుగుతాయి. అంత ఇంపార్టెన్స్ ఉన్నటువంటి పాత్ర నాది.

'దండోరా' పూర్తిగా సందేశాత్మక చిత్రం అనుకోవచ్చా?
'దండోరా' పూర్తిగా సందేశాత్మక చిత్రం కాదు. అన్ని రకాల కమర్షియల్ అంశాలను జోడించి తెరకెక్కించిన చిత్రమిది. అన్ని రకాల భావావేశాలున్న సినిమా ఇది. 'దండోరా' మాత్రం అద్భుతమైన సినిమా. ఇందులో గొప్ప స్క్రీన్ ప్లే ఉంటుంది. ఎంతో సహజంగా ఉండే చిత్రమిది. 'కోర్ట్' నుంచి తరువాత వస్తున్న చిత్రం కాబట్టి 'దండోరా'పై సహజంగానే అంచనాలు ఉంటాయి.

'వేదం', 'కంచెరపాలెం' చిత్రంలోనూ వేశ్య పాత్రల్ని చూపించారు. ఇందులో ఎలా చూపించబోతోన్నారు?
'దండోరా' చిత్రంలో బిందు మాధవి గారి పాత్రను చాలా క్లాసీగా చూపించారు. ప్రతీ ఒక్కరూ సినిమాతో, పాత్రలతో కనెక్ట్ అవుతారు.

మిమ్మల్ని కొత్త దర్శకులే ఎక్కువగా వాడుకుంటున్నట్టుగా ఉన్నారు?
నేను దాదాపు కొత్త దర్శకులతోనే పని చేస్తున్నాను. మన మేకర్స్ ఎక్కువగా లెక్కలు వేసుకుంటూ ఉంటారు. మన దగ్గర ఎంతో పొటెన్షియల్ యాక్టర్స్ ఉన్నా కూడా పక్క భాషల నుంచి తీసుకు వస్తుంటారు. ఇందులో నవదీప్, నందు, రవికృష్ణ ఇలా అందరూ అద్భుతమైన ఆర్టిస్టులే. ఇక్కడ మన వాళ్ల గురించి మనమే తక్కువ అంచనా వేసుకుంటాం. ఇదే శివాజీ 30 ఏళ్ల నుంచి ఇక్కడే ఉన్నాను. నేను ఇది వరకు ఎన్నో నెగెటివ్ పాత్రలు పోషించాను. కానీ మన దర్శకులకు నేను ఎక్కువగా కనిపించలేదేమో.



'దండోరా' తరువాత మీ నుంచి రాబోతోన్న చిత్రాల గురించి చెప్పండి?
'దండోరా' తరువాత నా నుంచి 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' అనే చిత్రం రాబోతోంది. ఆదిత్య హాసన్ దర్శకత్వంలో రానున్న 'ఎపిక్' అద్భుతంగా ఉండబోతోంది. ప్రతీ ఫ్యామిలీ, తండ్రీకొడుకులకు కనెక్ట్ అయ్యే ఎన్నో అద్భుతమైన సన్నివేశాలతో 'ఎపిక్' ఉంటుంది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200